



నిజాల నిగ్గు తేల్చే

# చర్చ

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155



తెలంగాణ , సంపుటి : 24 సంచిక : 34 బుధవారం, అక్టోబర్ 29, 2025 , పేజీలు - 12 వెల : 2/-


## మావోయిస్టులకు భారీ దెబ్బ

పలువురు అగ్రనేతల లొంగుబాటు

డిజిపి శిశధర్ ఎదుట లొంగిపోయిన నేతలు

పుల్లూరి ప్రసాద్ రావు, బండిప్రకాశ్‌లో లొంగుబాటు

లొంగిన వారిని పూర్తిస్థాయిలో ఆదుకుంటామన్న డిజిపి



2లో

## సినీ కార్మికులకు ప్రభుత్వం అండ

- టిక్కెట్ల రేట్లలో కార్మిక సంక్షేమం కోసం 20శాతం
- ఆరోగ్యశ్రీ, ఇళ్ల స్థలాలు, పిల్లలకు ప్రత్యేక స్కూలు
- ఆస్కార్ స్థాయికి సినీ పరిశ్రమను తీసుకెళ్లిన ఘనత మీదే
- సినీ కార్మిక సంఘం సన్మాన సభలో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,అక్టోబర్28:** ప్రపంచ సినీ పరిశ్రమకు హైదరాబాద్ నగరం వేదిక కావాలనేది తన సంకల్పమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సినీ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. యూసుఫ్‌గూడలో నిర్వహించిన సినీ కార్మికుల అభినందన సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినీ కార్మికుల సంక్షేమంపై సీఎం పలు కీలక హామీలు ఇచ్చారు. కృష్ణా నగర్‌లో మూడు నుంచి నాలుగు ఎకరాల్లో కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాల నిర్మిస్తాం. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం లంచ్ కూడా అందిస్తాం. రాజీవ్ ఆరోగ్యశ్రీతో పాటు ఉచిత వైద్యం కూడా అందిస్తాం అని చెప్పారు. తన మాటకు కట్టుబడి మిగతా2లో...

## ఎరువుల కంపెనీలకు న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ

- కంపెనీలకు రూ.37,952 కోట్ల చెల్లింపులు
- కేంద్ర కేబినేట్ నిర్ణయంపై కిషన్ రెడ్డి వివరణ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** ఎరువుల ఉత్పత్తి కంపెనీలకు న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ అమలు చేయాలన్న కేంద్ర కేబినెట్ నిర్ణయంపై.. కేంద్రమంత్రి మిగతా2లో...

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

- 8వ వేతన సవరణ కమిషన్‌కు కేబినెట్ ఆమోదం




**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. కోటీ పదిహేను లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, పింఛనుదారుల.. జీతాలు, పింఛన్లు పెంచేందుకు వీలుగా 8వ వేతన కమిషన్‌కు కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రంజన దేశాయ్ ఈపే కమిషన్‌కు ఛైర్‌పర్సన్‌గా మిగతా2లో...

## విద్యా రంగంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ

- గేమ్‌ఛేంజర్‌గా యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు
- వచ్చే ఏడునుంచి ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్
- డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి



**ఖమ్మం,అక్టోబర్28:** రాష్ట్ర విద్యా వ్యవస్థను గేమ్ చేంజర్‌గా మార్చే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా మధిర క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో విద్యా రంగంపై ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. విద్యా రంగంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలవాలన్న దృష్టితో సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. ఆ దిశగా ఆర్థికశాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా మిగతా2లో...

## ఎఐ టెక్నాలజీతో అప్రమత్తం

- డీప్‌ఫేక్ మోసాలతో జాగ్రత్త
- సేఫ్‌వర్డ్ టెక్నిక్ సూచించిన సిపి సజ్జన్నార్



**హైదరాబాద్,అక్టోబర్28:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పుడు మన జీవితంలో కీలకంగా మారింది. ఈ టెక్నాలజీ ఎంత శక్తివంతమైందో, అంతే ప్రమాదకరంగా కూడా మారుతోంది. ముఖ్యంగా డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా మన ముఖం, మన గొంతును కూడా కచ్చితంగా నకిలీగా సృష్టించడం సాధ్యమైంది. ఇప్పుడు ఎవరికైనా మీ వీడియో లేదా వాయిస్‌ను వాడి, మీరు మాట్లాడుతున్నట్టుగా నకిలీ సందేశాలు మిగతా2లో...



## మొంథా నేపథ్యంలో డివిజనల్ వార్ రూమ్‌లు

- కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదేశం

**/న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** 'మొంథా' తీవ్ర తుపాను నేపథ్యంలో సత్వర నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఒడిశా, తెలుగు రాష్ట్రల్లో డివిజనల్ వార్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే, మిగతా2లో...

## జూబ్లీహిల్స్ ఎన్నికపై కాంగ్రెస్ వ్యూహం

- డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు



**హైదరాబాద్, అక్టోబర్ 28:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది. ప్రతి డివిజన్ వారీగా మంత్రులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉప ఎన్నికలో ప్రతి ఓటు కీలకమని భావించిన సీఎం, బలమైన మంత్రులను రంగంలోకి దింపారు. ఈ క్రమంలో రహమత్‌నగర్ డివిజన్‌కు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మిగతా2లో...

## హరీష్ రావుకు పితృవియోగం

- తండ్రి సత్యానారాయణ కన్నుమూత
- బావకు నివాళి అర్పించి..అక్కను ఓదార్చిన కెసిఆర్
- కెటిఆర్, బిఆర్ఎస్ నేతల నివాళి
- మంత్రులు పోన్నం తదితరుల నివాళి
- సంతాపం తెలిపిన సిఎం రేవంత్, వైఎస్ జగన్





**హైదరాబాద్, అక్టోబర్ 28:** సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఇంట విషాదం నెలకొంది. హరీశ్ తండ్రి తన్నీరు సత్యనారాయణ కన్నుమూశారు. హైదరాబాద్ కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఆయన పార్థివ దేహాన్ని ఉంచారు. హరీశ్‌రావుకు పితృవియోగంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం మిగతా2లో...

## మొంథా తుపానుపై పిఠాపురంలో అప్రమత్తత..

- గంట గంటకు సమీక్షిస్తున్న పవన్ కల్యాణ్



2లో

# మావోయిస్టులకు భారీ దెబ్బ

**హైదరాబాద్,మన జనప్రగతి అక్టోబర్ 28:** మావోయిస్టులకు మరో దెబ్బతగిలింది. పలువురు అగ్రనేతలు లొంగిపోయారు. జనజీవన స్రవంతిలో కలవాలని తెలంగాణ ప్రభుత్వం పిలుపునిచ్చిన క్రమంలో రాష్ట్ర సర్కార్ పిలుపు మేరకు మావోయిస్టులు అజ్ఞాతం వీడారు. డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట మంగళవారం మావోయిస్టు అగ్రనేతలు లొంగిపోయారు. మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ శంకరన్న , చంద్రన్నా, మావోయిస్టు స్టేట్ కమిటీ మెంబెర్ బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ లొంగిపోయారు. అయితే, పుల్లూరి ప్రసాద్ రావుపై రూ.25 లక్షలు రివార్డు ఉంది. బండి ప్రకాష్ అలియాస్ ప్రభాతలపై రూ.20 లక్షలు రివార్డు ఉంది. అయితే, అజ్ఞాతంలో 64 మంది తెలంగాణ మావోయిస్టులు ఉన్నారు. ఇప్పటి వరకు 427మంది లొంగిపోయారు. అందులో 8 మంది స్టేట్ కమిటీ, 2 సెంట్రల్ కమిటీ మెంబెర్లు లొంగిపోయారు. 9 మంది మాత్రమే తెలంగాణలో, మిగిలిన వారు వేరే రాష్ట్రాల్లో ఉన్నారు. సెంట్రల్ కమిటీలో 5 మంది తెలంగాణ మావోయిస్టులు ఉన్నారు. 10 మంది స్టేట్ కమిటీ మెంబర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 20 మంది డిస్ట్రిక్ట్ కమిటీ, 14 మంది ఏరియా కమిటీల్లో, 10 మంది తెలంగాణ కమిటీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని డీజీపీ శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ ప్రకాశ్‌తో కలిసి మరో కీలక నేత పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. మావోయిస్టుల లొంగుబాటు వివరాలను డీజీపీ మీడియా సమావేశంలో వెల్లడించారు. 1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్‌జీకి అనుచరుడిగా మారారు. 1981లో పీపుల్స్‌వార్‌లో చేరి.. 1983లో కమాండర్ అయ్యారు. 1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడయ్యారు. 17 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయారని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. మావోయిస్టు మరో నేత బండ ప్రకాశ్ అలియాస్ ప్రభాత్.. 45 ఏళ్లు వివిధ స్థాయిల్లో పనిచేశారు. అతని స్వస్థలం తెలంగాణలోని మందమర్రి. ఏడో తరగతి చదువుతున్నప్పుడే నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారు. 2004లో జరిగిన శాంతి చర్చల్లో ప్రకాశ్ పాల్గొన్నారు. 2019లో స్టేట్ కమిటీ సభ్యుడ య్యారు. నేషనల్ పార్క్ ఏరియా కీలక ఆర్గనైజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. బండ ప్రకాశ్‌పై ఉన్న రూ.20లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం. పుల్లూరి ప్రసాదరావుపై ఉన్న రూ.25లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం. తెలంగాణకు చెందిన ఇంకా 64 మంది మావోయిస్టులు కొనసాగుతున్నారు. పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు నేతలపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ కరెక్ట్ కాదు. అవసరమైతే.. వారికి రక్షణ కల్పిస్తాం అని డీజీపీ తెలిపారు. మావోయిస్టులు చంద్రన్నా, బండి ప్రకాశ్ అజ్ఞాతం వీడారని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పిలుపు మేరకు అజ్ఞాతం నుంచి బయటికి వచ్చి జనజీవన స్రవంతిలో కలిశారని పేర్కొన్నారు. పుల్లూరి ప్రసాద్ రావ్ అ చంద్రన్నది పెద్దపల్లి మండలమని తెలపారు. చంద్రన్న15 ఏళ్ల కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారని గుర్తుచేశారు. మొదట రాడికల్ స్టూడెంట్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారని వెల్లడించారు. 1980లో కిషన్‌జీకి కొరియర్‌గా చేశారని గుర్తుచేశారు. 2008లోనే కేంద్ర కమిటీ మెంబర్‌గా చంద్రన్న ఉన్నారని తెలిపారు. 2024 డిసెంబర్ వరకు తెలంగాణ స్టేట్ కమిటీ సెక్రటరీగా ఉన్నారని వివరించారు. అక్టోబరు 21వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చంద్రన్న జన జీవన స్రవంతిలో కలిశారని చెప్పుకొచ్చారు. చంద్రన్న ఆరోగ్యం కూడా సహకరించకపోవడంతో అజ్ఞాతం వీడారని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీలో చీలిక వచ్చిందని లొంగిపోయిన మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ శంకరన్న తెలిపారు. తీవ్ర అనారోగ్య కారణాలతో తాను జనజీవన స్రవంతిలో కలిశానని చెప్పుకొచ్చారు. ఇప్పటి నుంచి ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని వెల్లడించారు. మావోయిస్టు భావజాలానికి తానెప్పుడూ కూడా విజ్ఞుడేనని స్పష్టం చేశారు. మావోయిస్టు పార్టీలో వచ్చిన విభేదాలు, చీలికల వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పుకొచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నక్సలైట్లు తమ సోదరులని.. లొంగిపోవాలని సీఎం పిలుపునిచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి పిలుపుమేరకు తాము ప్రజలతో కలిసి పని చేయాలని భావించామని పేర్కొన్నారు. అలాగే, తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి పిలుపు మేరకు సరెండర్ అయ్యామని పుల్లూరి ప్రసాద్ రావు స్పష్టం చేశారు.

# సినీ కార్మికులకు ప్రభుత్వం అండ

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణానగర్‌కు వచ్చానని గుర్తుచేసిన రేవంత్.. కార్మికుల కోసం ప్రభుత్వం చేయాల్సిన పనులు చేస్తాం. వెల్ఫేర్ ఫండ్‌కు 10 కోట్లు ఇస్తున్నాం. కష్టాల్లో ఉన్న కార్మికుల కోసం ఆ నిధులు వినియోగించండని అన్నారు. అంతేకాకుండా, సినిమా టికెట్ రేట్లు పెంచాలంటే కార్మికులకు 20 శాతం వాటా తప్పనిసరి ఇవ్వాల్సిందేనని అన్నారు.. ఆ వాటా వెల్ఫేర్ ఫండ్‌కు బదిలీ అవ్వాలి. లేదంటే టికెట్ ధరల పెంపుకు జీఓ ఇవ్వం అని స్పష్టం చేశారు. నిర్మాతలు, కార్మికులు కుటుంబ సభ్యుల్లా ఉండాలని సూచించారు. ఫైటర్స్, టెక్నీషియన్ల నైపుణ్యం పెంచేందుకు ఫ్యూచర్ సిటీలో భూమి కేటాయిస్తామని తెలిపారు. మీకు అవసరం ఉన్నప్పుడు మీకు అందుబాటులో ఉంటా. ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెన్నంటి ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.సినీ కార్మికుల శ్రమ నాకు బాగా తెలుసు. మీ కష్టాలు తెలుసుకోలేనంతగా నా కళ్లు మూసుకోలేదని పేర్కొన్నారు. సినీ పరిశ్రమకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని సీఎం హామీ ఇచ్చారు. ఒకప్పుడు సినీ పరిశ్రమ అంటే మద్రాసే అనుకునే వారు. కానీ, నేడు తెలుగు సినిమా ఆస్కార్ అవార్డుల వరకు వెళ్లగలిగింది. ఈ గౌరవం తెర వెనుక కష్టపడే కార్మికుల శ్రమ ఫలితమే అని రేవంత్ అభినందించారు. నిలిచిపోయిన నంది అవార్డులను ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరుతో అవార్డులను ఇస్తున్నామని సీఎం తెలిపారు. హాలీవుడ్ కూడా తెలంగాణకు వచ్చి షూటింగ్ చేసుకునేలా మారాలి. చిన్న సినిమాలను తక్కువ చేసి చూసే ప్రసక్తే లేదు. ఐటీ రంగానికి ఎంత ప్రాధాన్యత ఇస్తామో, సినిమా పరిశ్రమకూ అంతే ప్రాధాన్యత ఇస్తాం అని ఆయన అన్నారు. ఐటీ, ఫార్మా పరిశ్రమలు ఎలాగో.. ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా అంతే. మీరు అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా. హాలీవుడ్ సినిమాలు రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్‌లో షూటింగ్‌లు జరిగేలా బాధ్యత తీసుకుంటాం. ప్రభుత్వం చేయగలిగిన పనులు చేస్తాం. సినిమా టికెట్ల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో 20శాతం కార్మికులకు ఇవ్వాలి. కార్మికులకు లాభాల్లో 20శాతం ఇస్తేనే టికెట్ల ధరలు పెంచుకునేందుకు జీవో ఇస్తాం. త్వరలోనే సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం అని సీఎం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కృషి చేసినట్లు చెప్పిన సీఎం రేవంత్. 1964లో నంది అవార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. హైదరాబాద్ కు సినీ పరిశ్రమ రావడంలో మర్రిచెన్నారెడ్డి పాత్ర కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఎంతో మందిని సంప్రదించి పరిశ్రమను తెచ్చారని గుర్తుచేశారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికులను ఆదుకున్నారని.. కార్మికుల కోసం పది ఎకరాలు ఇచ్చారని తెలిపారు. పరిశ్రమను ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు సీఎం. సినీ కార్మికులకు ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు , పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఎఐ టెక్నాలజీతో అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

పంపడం, వీడియోలు తయారు చేయడం లేదా కాల్స్ చేయడం సాధ్యమవుతోంది. దీంతో వ్యక్తిగత, ఆర్థిక మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. తాజాగా పలు దేశాల్లోనే కాకుండా మన దేశంలో కూడా డీప్‌ఫేక్ ఆధారంగా మోసాలు జరుగుతున్నాయి. కొంతమంది మోసగాళ్లు మీ స్నేహితులు, బంధువులు, సహచరులు లేదా అధికారులుగా నటిస్తూ డబ్బు లేదా వ్యక్తిగత సమాచారం తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి మోసాలను గుర్తించడం చాలా కష్టంగా మారింది, ఎందుకంటే అవి నిజంగా ఉన్నట్లే కనిపిస్తాయి. ఇలాంటి మోసాల నుంచి రక్షణ పొందేందుకు ఒక సులభమైన కానీ అత్యంత ప్రభావవంతమైన పద్ధతి 'సేఫ్ వర్డ్'. అది మీరు మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సహచరులతో మాత్రమే పంచుకునే ఒక ప్రత్యేక పదం లేదా సంకేతం. ఏదైనా అనుమానాస్పద కాల్ లేదా మెసేజ్ వస్తే, ఆ వ్యక్తి నిజమా కాదా తెలుసుకోవడానికి ఆ 'సేఫ్ వర్డ్' అడగాల్సి ఉంటుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ ఈ విషయంలో ప్రజలకు హెచ్చరిక చేశారు. ఇలాంటి విషయాల్లో జాగ్రత్త అవసరమని అన్నారు. సేఫ్ వర్డ్ ఎలా ఉపయోగించాలంటే.. మీకు అత్యంత నమ్మకమైన వారితో ఒక ప్రత్యేక సేఫ్ వర్డ్ నిర్ణయించుకోండి. అనుమానాస్పద కాల్ లేదా మెసేజ్ వచ్చినప్పుడు ఆ వర్డ్ అడిగి ధృవీకరించండి. ఆ సేఫ్ వర్డ్‌ను బయట ఎవరితోనూ పంచుకోకండి. బ్యాంక్ వివరాలు, క్షిఖలు లేదా వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకండి. ఎఐ మన జీవితాన్ని సులభతరం చేస్తుంది, కానీ అదే మన భద్రతకు ప్రమాదం కావచ్చు. టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండటం, కొత్త మోసాలపై అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యం. 'సేఫ్ వర్డ్' వంటి చిన్న జాగ్రత్త ? పెద్ద ప్రమాదాల నుంచి మిమ్మల్ని కాపాడగలదన్నారు. ఇలాంటి మోసాలపై అవగాహన పెంచే ప్రయత్నంగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఎక్స్ లో ఒక హెచ్చరిక పోస్టు చేశారు. ఎఐ టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందుతుందో, అంతే జాగ్రత్త అవసరం అని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ భద్రత కోసం 'సేఫ్ వర్డ్' విధానం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఒక చిన్న జాగ్రత్త ? పెద్ద మోసాల నుండి కాపాడుతుంది అంటూ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# హరీష్ రావుకు పితృవియోగం

(మొదటి పేజీ తరువాయి)

ఫిల్మ్ నగర్ మహాప్రస్థానంలో నిర్వహించారు. తన్నీరు సత్యనారాయణ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. తన బావతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకుని, ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సమాచారం తెలిసిన వెంటనే హరీశ్ రావును ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కోకాపేటలోని హరీశ్ రావు నివాసానికి వెళ్లి, దివంగత సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. తన సోదరిని, కుటుంబ సభ్యులను ఓదార్చనున్నారు. భర్తను కోల్పోయిన అక్క లక్ష్మమ్మకు కేసీఆర్ ధైర్యం చెప్పారు. ఇక హరీశ్‌రావును గుండెలకు హత్తుకుని కేసీఆర్ ఓదార్చారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తన్నీరు సత్యనారాయణ రావు కన్నుమూశారు. ఆయన పార్థివ దేహానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఉన్న ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. హరీశ్ రావును, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సతీమణి శోభ.. హరీశ్ రావును ఓదార్చారు. సత్యనారాయణ రావు భౌతికకాయానికి నివాళు లర్పించారు. అదేవిధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బిగాల గణెశిశ్ గుప్తా, మెతుకు ఆనంద్, హరీశ్ రావును పరామర్శిం చారు. సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు నివాళి అర్పించారు.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరించనున్నారు. ప్రస్తుత 7వ వేతన సవరణ సంఘం కాలపరిమితి 2026తో ముగుస్తోంది. ఆ తర్వాత కొత్త వేతన సవరణ అమలు చేయడానికి వీలుగా 8వ పే కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై పలువురు కేంద్ర మంత్రులు, మంత్రిత్వ విభాగాల సిబ్బందితో విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపింది. అనంతరం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్‌లో ఛైర్‌పర్సన్, ఇద్దరు సభ్యులు ఉండనున్నారు. ఈ సంఘం 18 నెలల్లో సిఫార్సులు ఇవ్వనుందని కేంద్రం ఓ ప్రకటనలో వెల్లడించింది. దేశంలో సుమారు 50 లక్షల మంది కేంద్ర ఉద్యోగులు, 65 లక్షల మంది పింఛనుదారుల వేతనాలు, భత్యా లు ఎంత ఉండాలో నిర్ణయించడంలో వేతన సంఘం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థి తులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతమున్న జీతాలు, పింఛన్లను ఎంత మేర పెంచాలో ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం వేతన సవరణ చేపడుతుంది.

# ఎరువుల కంపెనీలకు న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ

(మొదటి పేజీ తరువాయి)

జి.కిషన్‌రెడ్డి మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం గత 11 ఏళ్లుగా కారక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం కేంద్ర కేబినెట్ మరో చారిత్రక నిర్ణయం తీసుకుందని తెలిపారు. రైతులపై ఎరువుల ధరలు భారం పడకుండా, ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రూ.37,952 కోట్ల న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ అమలు చేయాలని నిర్ణయించిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయంగా వివిధ కారణాలతో ఎరువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ.. ఈ ధరల ప్రభావం ఏమాత్రం రైతులపై పడకుండా చర్యలు తీసుకుంటోందని చెప్పుకొచ్చారు. ఈ ప్రయత్నంలో భాగంగా.. ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై పడు తున్న భారాన్ని కేంద్ర ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వ ంలో ఇవాళ సమావేశమైన కేంద్ర కేబినెట్.. 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి.. డై అల్యూ మినియం ఫాస్ఫేట్ , మోనో అల్యూమినియం ఫాస్ఫేట్ , మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ , ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్ , 3 గ్రేడ్స్ ఆఫ్ సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ , పొటాష్ డెరైవ్డ్ మొలాసెస్ , అల్యూమి నియం సల్ఫేట్ వంటి దాదాపు 28 ఫెర్టిలైజర్స్‌ను ఉత్పత్తి చేసే కంపెనీలకు న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీ అమలు చేయాలని నిర్ణయించిందని వివరించారు కిషన్‌రెడ్డి. ఇందుకోసం.. అంతర్జాతీ యంగా పెరిగిన ధరలతో ఈ ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై భారం పడకుండా.. రబీ సీజన్ కోసం రూ.37,952 కోట్లు కేటాయిస్తున్నట్లు కేబినెట్ నిర్ణయించిందని వెల్లడించారు. ఇది ఎరువులు ఉత్పత్తి కంపెనీలకు కూడా భారం పడకుండా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పుకొచ్చారు.

# మొంథా నేపథ్యంలో డివిజనల్ వార్ రూమ్‌లు

(మొదటి పేజీ తరువాయి)

ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలను రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదేశించారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు డివిజన్లలో అవసరమైన సామగ్రి, యంత్రాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొంథా తుపాను దృష్ట్యా తీసుకుంటున్న చర్యలపై నివేదిక కోరారు. తీసుకోవాల్సిన మరిన్ని చర్యలపై దిశానిర్దేశర చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రయాణికులకు అసౌకర్యాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర వేళల్లో సత్వరం స్పందించాలన్నారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికపై కాంగ్రెస్ వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను నియమించారు. బోరబండ డివిజన్ బాధ్యతలు సీతక్క, మల్లు రవికి అప్పగించారు. వెంగళ్ రావునగర్ డివిజన్‌లో తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సమన్వయం చేస్తారు.సోమాజిగూడ డివిజన్ పర్యవేక్షణ బాధ్యతలు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ వహించనున్నారు. షేక్‌పేట డివిజన్ బాధ్యతలు కొండా సురేఖ, వివేక్ తీసుకుంటారు. ఎర్రగడ్డ డివిజన్‌ను దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు చూసుకుంటారు. అలాగే యూసుఫ్‌గూడ డివిజన్ పర్యవేక్షణ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నంలకు అప్పగించారు. ఉప ఎన్నికలో సమన్వయం, ప్రచార వ్యూహం, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలను ప్రతి మంత్రి స్థాయిలో పర్యవేక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# మొంథా తుపానుపై పిఠాపురంలో అప్రమత్తత..

**అమరావతి, అక్టోబర్ 28:** మొంథా తుపాను ప్రభావం పిఠాపురం నియోజకవర్గంపై తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో యంత్రాంగం అప్రమత్తంగా ఉండి, సర్వ సన్నద్ధతతో ఏర్పాట్లు చేశారు. పవన్ కళ్యాణ్ నిరంతరం నివేదికలు విశ్లేషించి అధికారులతో చర్చిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఉప్పాడ, మూలపేట, కోనపాపపేట తదితర తీర ప్రాంత గ్రామాల్లో సహాయక చర్యల పర్యవేక్షణకు గ్రామానికి ఒకరు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించారు. 34మంది సభ్యులతో ఒక ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందం పిఠాపురం నియోజకవర్గంలో అప్రమత్తంగా ఉంది. 34 బోట్లు సిద్ధం చేశారు. వీరికి తోడుగా 12 మంది సభ్యుల క్విక్ రెస్పాన్స్ టీమ్ సభ్యులు, 12 మంది గజ ఈతగాళ్ళు ఉన్నారు. పిఠాపురం కేంద్రంగా ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందం పని చేస్తోంది.

# విద్యా రంగంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

ముందుకు సాగుతున్నామన్నారు.గ్రామీణ యువత పోటీ పరీక్షల కోసం దూరప్రాంతాలకు వెళ్లి ఖర్చులు పెట్టాల్సిన అవసరం లేకుండా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. డిజిటల్ లైబ్రరీ, నిష్ణాతులైన అధ్యాపకులచే ఆన్‌లైన్ కోచింగ్, పోటీ పరీక్షలకు అవసరమైన మొత్తం స్టడీ మెటీరియల్ ఈ సెంటర్లలో అందుబాటు లోకి తీసుకొస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో ఐదు ప్రదేశాల్లో ఇవి ప్రారంభించేందుకు చర్యలు వేగవంతం చేశామని చెప్పారు. పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ అందించేందుకు కూడా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని భట్టి ప్రకటించారు. మారుతున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా, పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజనీరింగ్ కళాశాలలుగా దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రతి మండలంలో మూడు ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక వసతులు, బోధనా సౌకర్యాలు పెంచుతున్నామని స్పష్టం చేశారు.ప్రతి పది గ్రామాలకు ఒక పాఠశాలను గుర్తించి అప్‌గ్రేడ్ చేస్తున్నామని చెప్పారు.

# బాధిత కుటుంబాలకు వెలిచాల రాజేందర్ రావు పరామర్శ



చర్చ :- కరీంనగర్ కరీంనగర్ లోని పాత బజార్, వల్లంపహాడ్ లో ఇరువురు బాధిత కుటుంబాలను మంగళవారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పరామర్శించారు. వల్లంపహాడు మాజీ సర్పంచ్ సాదినేని మునిరాజ్ తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను రాజేందర్ రావు పరామర్శించారు. అదేవిధంగా పాత బజార్లో చిరంజీవి అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు కోడూరి హరికృష్ణ గౌడ్ తమ్ముడు కోడూరి శైలేష్ గౌడ్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు కొలగాని అనిల్, గుర్రం అశోక్ గౌడ్ వేల్పుల వెంకటేష్, అనంతుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎంపిడిఓ లు



చర్చ :- కరీంనగర్. పెద్దపల్లి గ్రూప్ -1 నియామకాల లో భాగంగా పెద్దపెల్లి జిల్లాకు కేటాయించిన 3 ఎంపిడిఓలు మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ను మర్యాద పూర్వకంగా కలిశారు.గ్రూప్ 1 ఫలితాలలో 509 ర్యాంకు సాధించిన కరీంనగర్ కు చెందిన కంకణాకల శ్రీజా రెడ్డి, 609 ర్యాంకు సాధించిన జగిత్యాలకు చెందిన వేముల సుమ లత, 446 ర్యాంకు సాధించిన కరీంనగర్ జిల్లాకు చెందిన సాదినేని ప్రియాంక లను పెద్దపెల్లి జిల్లా కేడర్ కు కేటాయించడం జరిగింది. కంకణాల శ్రీజ రెడ్డి ను మంథని ఎంపీడీవో గా, వేముల సుమ లతను అంతర్గాం ఎంపీడీవో గా, సాదినేని ప్రియాంక ను కమాన్ పూర్ ఎంపిడిఓ గా కలెక్టర్ కేటాయించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


# పేకాటరాయుళ్ల అరెస్ట్

- రెండు చోట్ల పోలీసుల దాడి
- 17 మంది అరెస్ట్,
- 29 వేలకుపైగా నగదు స్వాధీనం




చర్చ, జగిత్యాల( అక్టోబర్ 28) పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారం తో సిసి ఎస్ పోలీసులు కోరుట్ల, మేడిపల్లి ప్రాంతాల్లో జరిపిన దాడిలో పేకాట ఆడుతున్న 17 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 29 వేల నగదు, 12 మొబైల్స్ స్వాధీనం చేసుకొని సమీప పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు సిసి ఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల లో మీడియా తో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అదేశాల మేరకు పేకాట రాయుళ్ళ పై నిఘా పెట్టామన్నారు. అందిన పక్కా సమాచారం తో కోరుట్ల పట్టణంలోని అష్ట లక్ష్మి ఆలయ సమీపంలో, మేడిపల్లి మండలం లోని కల్వకోట గ్రామ శివారులో వేరు వేరుగా దాడులు నిర్వహించినట్లు తెలిపారు. రెండు చోట్ల నిర్వహించిన దాడిలో 17 మంది పేకాట ఆడుతున్న వారిని పట్టుకొన్నామని వీరివద్ద నుంచి 29 వేల 370 నగదు, 12 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పేకాట ఆడడం నేరమన్నారు. పేకాట ఆడినా, అడే వారికోసం సదుపాయాలు కల్పించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొంటామని అన్నారు.

# తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద తీవ్రంగా ఖండించారు


TELANGANA STATE COMMISSION FOR WOMEN
HYDERABAD
TGSCW
SMT. NERELLA SHARADA
CHAIRPERSON

ప్రెస్ నోట్

తేది: 28.10.2025

కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులపై అటెండర్ చేసిన అనుచిత ప్రవర్తను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ శ్రీమతి నేరెళ్ల శారద గారు తీవ్రంగా ఖండించారు.

విద్యాసంస్థల్లో చదువుకునే బాలికల భద్రత, గౌరవం పట్ల నిర్లక్ష్యాన్ని, ఏ రూపంలోనూ సహించబోమని చైర్పర్సన్ గారు స్పష్టం చేశారు.

మహిళా కమిషన్ చైర్పర్సన్ గారు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసి, విషయంపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యాసంస్థలు విద్యార్థినుల భవిష్యత్తు నిర్మాణంలో కీలకమైనవని, అవి స్వేచ్ఛాయుత, సురక్షిత మరియు గౌరవప్రదమైన వాతావరణం లో ఉండాలని, విద్యార్థినులపై ఎలాంటి వేధింపులు, అనుచిత ప్రవర్తనను ఏ పరిస్థితిలోనూ సహించబోమని చైర్పర్సన్ గారు స్పష్టం చేశారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నిరోధించేందుకు, జిల్లా యంత్రాంగం కాలేజీలు, విద్యాసంస్థలు మరియు హాస్టళ్లలో తనిఖీలు చేపట్టి భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని చైర్పర్సన్ గారు ఆదేశించారు.

ఈ కేసు పురోగతిని మహిళా కమిషన్ పర్యవేక్షిస్తామని, బాధిత విద్యార్థినులకు అన్ని విధాల సహకారం అందిస్తామని చైర్పర్సన్ గారు హామీ ఇచ్చారు.

(శ్రీమతి నేరెళ్ల శారద)
చైర్పర్సన్

చర్చ :- కరీంనగర్ కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులపై అటెండర్ చేసిన అనుచిత ప్రవర్తను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద తీవ్రంగా ఖండించారు.విద్యాసంస్థల్లో చదువుకునే బాలికల భద్రత, గౌరవం పట్ల నిర్లక్ష్యాన్ని, ఏ రూపంలోనూ సహించబోమని చైర్పర్సన్ స్పష్టం చేశారు.మహిళా కమిషన్ చైర్పర్సన్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసి, విషయంపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విద్యాసంస్థలు విద్యార్థినుల భవిష్యత్తు నిర్మాణంలో కీలకమైనవని, అవి స్వేచ్ఛాయుత, సురక్షిత మరియు గౌరవప్రదమైన వాతావరణం లో ఉండాలని, విద్యార్థినులపై ఎలాంటి వేధింపులు, అనుచిత ప్రవర్తనను ఏ పరిస్తుతలోనూ సహించబోమని చైర్పర్సన్ స్పష్టం చేశారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నిరోధించేందుకు, జిల్లా యంత్రాంగం కాలేజీలు, విద్యాసంస్థలు మరియు హాస్టళ్లలో తనిఖీలు చేపట్టి భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని చైర్పర్సన్ ఆదేశించారు.ఈ కేసు పురోగతిని మహిళా కమిషన్ పర్యవేక్షిస్తామని, బాధిత విద్యార్థినులకు అన్ని విధాల సహకారం అందిస్తామని చైర్పర్సన్ హామీ ఇచ్చారు.నేరెళ్ల శారదచైర్ పర్సన్ తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్

# దివ్యాంగులకు సేవ చేయడం అభినందనీయం

**- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**





చర్చ :- కరీంనగర్ స్వాతంత్ర సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సేవలు అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.కరీంనగర్ జిల్లా స్వాతంత్ర సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్లో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, వృత్తి విద్యా శిక్షణ కేంద్రానికి నూతన బస్సు ప్రారంభోత్సవం జరిగింది. 26 లక్షల రూపాయలతో శ్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ఈ బస్సు ను అందజేసింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బస్సును ప్రారంభించి మానసిక విద్యార్థులకు కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మానసిక వికలాంగుల పాఠశాలను, వృత్తి విద్యా కేంద్రాన్ని స్థాపించి ట్రస్ట్ సభ్యులు నిర్విరామంగా దశాబ్దాల పాటు సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. దివ్యాంగుల మానసిక వికాసానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది సేవలను కొనియాడారు.ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా స్వాతంత్ర సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మానసిక వికలాంగుల పాఠశాలలో 130 మంది విద్యార్థులు చదువుతున్నారని, 40 మంది ఉపాధి పొందుతున్నారని అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 136 మందికి కంటి ఆపరేషన్లు చేయించామని తెలిపారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ డీజీఎం సిహెచ్ వెంకట రెడ్డి, బోర్డు డైరెక్టర్ తిరుమల, ట్రస్ట్ వ్యవస్థాపకులు బి.వెంకటయ్య, ఇతర ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఇక్కడ నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళ, ఓపి రిజిస్టర్ ను పరిశీలించారు. గర్భిణీలకు 4 ఏ.ఎన్.సి వైద్య పరీక్షల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వారికి కచ్చితంగా నాలుగు ఏ. ఎన్. సి పరీక్షలు అయ్యేలా చూడాలని తెలిపారు. సాధారణ ప్రసవాల ప్రాధాన్యత పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి వెంకటరమణ ఉన్నారు. దివ్యాంగులకు సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరం పరిశీలనఎల్ఎండి కాలనీలోని దుర్గాబాయి దేశ్ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అలింకో సహకారంతో నిర్వహించిన దివ్యాంగులకు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. శిబిరానికి హాజరైన వారి వివరాలు, వైద్య పరీక్షల వివరాలు పక్కాగా నమోదు చేయాలని అన్నారు.

# ప్రభుత్వ పాఠశాల బాలికల బాత్రూంలో సీక్రెట్ కెమెరా



చర్చ :- కరీంనగర్ మానవ మృుగాుళ్ల దాురుుణాులుుతో బాులుికులుుకు రక్షుణే లేుకుయిడా పోుతోయిది. బడుకు పోుతే ముచ్చ మిచ్చ చేుష్టులు చేుస్తూ ఇబ్బాయిదుుట్టే ఉపాుధ్యాుయుులు రూుపయిలో ఉన్న కాుమాయిధుులు కొయిదుురైుతే.. అమ్మాుయిల వాష్ రూుమ్స్లుో రహుస్య కుమెురాులు మొుట్టి మీుడుయోులు రికాుర్డు చేసి.. మికృత ఆనయిదం పోయిదే నీచులు మరుకొయిదుురు. తాు జాుగా కరీయినుగుర్ జుల్లా కురుిక్యాల ప్రుభుుత్వ పాఠుశాులలోని బాులుకల వాష్ రూమ్ లో రహుస్య కుమెురా బయటుపుడుుడం తీుప్ర కలుకులం రేపిం యిది. అమ్మాుయిల బాుత్రూుమ్లో అటెయిడుర్ యాు కూు బ్ సీుక్రుట్ కుమెురాును మొుట్టి.. మీుడియో లు రికా యర్డు చేుస్తుున్నాుడు. బాుత్రూుమ్లో ఓ పరుకురం మొురు స్తూ ఓ పరుకురం బాులుకల కయిటు పుడియిది. ఏంటా అని చెక్ చేుయుగా.. రహుస్య కుమెురా అని గుుర్తియిచాుురు. వెయిటునే ప్రధానోపాధ్యాయు నికి తల్లిదయిడ్రుులుకి ఫిుర్యాుదు చేుశాురు. బాుత్రూుమ్ నుయిచి కుమెురా తరహా పరుకురం స్వాుధీునం చేుసుకుున్నాురు పోులీుసుులు. ఆగ్రుహాయితో తల్లిుదయిడ్రులు పాుఠుశాల వద్దుకు చేురుుకొని నియిదితుుడుపై చర్యులు తీుసుుకోవాులని డుమాయిడ్ చేుశాురు.ఈ ఘటునుతో గ్రాుమయిలో ఉద్రిుక్తత వాుతాుమరుణం నెలుకొయిది. ఈ దాురుుణాునికి ఒడుగుట్టియిది ఆ పాఠుశాలుకు చెయిదిన అటెయిడుర్ యాుకూుబ్ అని తేులియిది. ఇతను సీుక్రుట్ కుమెురాును అమర్చి.. మీుడియోులు రికార్డు చేుస్తూ మికృత ఆనయిదం పాయిదు తున్నుట్లు పోలీుసులు అనుమాుమినుస్తున్నాుురు. అంతే కాుకుయిడా.. అటెయిడుర్ యాుకూుబ్ బాులుకల ఫోుటోలు తీసి వాుటుని అశ్లీల చిుత్రాులుుగా మార్ఫియిగ్ కూడా చేుస్తుున్నుట్లు సమాుచాురం.బాులుకులు, వారి తల్లిుదయిడ్రు లు వెయిటునే ఈ మిషుయాున్ని హెుడ్మాుస్టుర్కు ఫిుర్యాుదు చేుశాురు. హెుడ్మాుస్టుర్ ఫిుర్యాుదు మేురుకు పోలీుసులు రయిగయిలోకి దిుగాురు. పోలీుసులు వాుష్రూుమ్ నుయిచి కుమెురా తరహా పరుకురాున్ని స్వాుధీునం చేుసుకుున్నాురు. ఈ పరుకురయిలో ఉన్న రికార్డుల ఆధాురయిగా దర్యాుప్తును మేుగువయితం చేుశాురు. నియిదితుుడైన అటెయిడుర్ యాుకూుబ్ ఈ మిషుయం బయటుపుడుటయితోునే పరాురీలో ఉన్నాుడు. స్కూల్ వాుతాుమరుణయిలో ఇలాయిటి ఘటునులు జరుగుడం దాురుుణం. ఈ ఘటునుతో మిద్యాుర్థుల తల్లిుదయిడ్రులు తీుప్ర ఆమేదునుకు గుురువుతు న్నాురు. ఈ వ్యుమహాురాునికి పాుల్పుడిన వ్యుక్తుని కఠినయిగా శుక్షియిచాులుని మిద్యాుర్థులు తల్లిుదయిడ్రులు ప్రుభుత్వాున్ని డుమాయిడ్ చేుస్తున్నాురు.

# గెలుపు బాటలో వెలిచాల ప్యానల్

**- అర్బన్ బ్యాంకు ఎన్నికల ప్రచారంలో దుసుకుపోతున్న లినిర్మల భరోసా ప్యానల్**
**అర్బన్ బ్యాంక్ అభివృద్ధిలో జగపతిరావుది ప్రత్యేక ముద్ర**
**- ప్రతి చోటా జగపతిరావు చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తున్న ఓటరు**
**డైనమిక్ లీడర్ అంటూ ప్రశంసలు**
**- తండ్రి బాటలో తనయుడు రాజేందర్ రావు.**
**- అర్బన్ బ్యాంకు సభ్యుల నుంచి అనూహ్య మద్దతు.**
**- జగిత్యాల లో విస్తృత ప్రచారం.**



చర్చ :- కరీంనగర్ కరీంనగర్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ప్యానెల్ అభ్యర్థులు దూసుకెళ్తున్నారు. ఘనవిజయం సాధించే దిశగా రోజురోజుకు బ్యాంకు సభ్యుల నుంచి అనుహ్య మద్దతు లభిస్తోంది. వెలిచాల మద్దతిస్తున్న ప్యానల్ గెలుపుతోనే అర్బన్ బ్యాంకు మహర్దశ లభిస్తుందని సంఘీభావం ప్రకటిస్తున్నారు. ప్యానల్ అభ్యర్థులకు కచ్చితంగా ఓటు వేసి గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు స్వయంగా ఒక ప్యానెల్ ను ఏర్పాటు చేశారు. నీతిమంతంగా నిజాయితీగా అర్బన్ బ్యాంకు అభివృద్ధికి పాటుపడాలనే పట్టుదలతో తన వంతుగా ప్రత్యేక కృషి చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రత్యేకంగా జగిత్యాల ప్రాంతంలో రాజేందర్ రావు తండ్రి వెలిచాల జగపతిరావు పేరు తెలియని వారు లేరు. కరీంనగర్ రత్నం బ్యాంకు అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారు. బ్యాంక్ అభివృద్ధికి ఎంతో దోహదపడ్డారు. నిజాయితీగా నీతిమంతంగా సేవలందించేలా తన ప్యానల్ ను నాలుగు సార్లు గెలిపించుకున్నారు. గతంలో 1972 నుంచి 1977 వరకు జగిత్యాల ఎమ్మెల్యేగా జగపతిరావు పనిచేశారు. జగపతిరావు ఈ ప్రాంతం అభివృద్ధికి విశేష కృషి చేశారు. నాడు తాగునీటి కోసం అష్ట కష్టాలు పడుతున్న ప్రజానీకానికి అండగా నిలిచారు. జగిత్యాల నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా నియోజకవర్గ వ్యాప్తంగా విద్యుత్తు వెలుగులు అందించిన ఘనత జగపతిరావు గారిదే. ఇండ్లలో దీపాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్న పేద ప్రజల ఇండ్లలో కరెంటు వెలుగులు నింపారు. సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయించి గ్రామ గ్రామానా విద్యుత్ సౌకర్యం పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. దీంతోపాటు ఈ ప్రాంత రైతాంగం సంక్షేమం కోసం కొత్త కొత్త పరిశోధనలు అందించేందుకు దోహదపడేలా అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని అప్పటి పాలకులను ఒప్పించి పొలాస వ్యవసాయ క్షేత్రం ఇక్కడ ఏర్పాటు చేయించారు. తద్వారా పొలాస వ్యవసాయ క్షేత్రం ద్వారా పరిశోధనలు కొత్త కొత్త వంగడాల రూపకల్పనకు ఎంతో ధోహదపడుతున్నది. ఈ ప్రాంత రైతాంగం ఆర్థికంగా అభివృద్ధి చెందాలనీ వెన్నుదన్నుగా నిలిచారు జగపతిరావు. ఇప్పటికీ రైతులు ప్రజల్లో జగపతిరావు పేరు చిరస్మరణీయంగా నిలిచిపోయింది. ఇప్పటికి ప్రజలు జగపతిరావును గుర్తు చేస్తున్నారంటే ఆయన చేసిన అభివృద్ధి ముద్ర ప్రత్యేకమైనది. జగిత్యాల ప్రాంత యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటుగా మార్క్ఫెడ్ సస్థకు ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకు వచ్చారు. అనేక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి వారి జీవితాల్లో వెలుగులు ప్రసరించేలా చేశారు. తండ్రి బాటలో తనయుడు. అంతేకాకుండా రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేకతను సాధించుకొని కుల మతాలకతీతంగా వెలిచాల జగపతిరావు నాయకుడిగా, ప్రజల మనిషిగా.. ప్రజల ఆత్మబంధువుగా ముందుండి రాజకీయాలను నడిపించారు. అప్పటి పాలకులను మెప్పించి ఒప్పించి తన ప్రజల కోసం పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు మంజూరు చేయించారు. అదేవిధంగా నాడు కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ ఆవిర్భావంలో జగపతిరావు చేసిన కృషి నేడు సత్ఫలితాలను ఇస్తున్నది. బ్యాంక్ అభివృద్ధిలోనూ ప్రత్యేక కృషి ఉంది. నాలుగు సార్లు సొంతంగా ప్యానల్ ను ఏర్పాటు చేసి గెలిపించుకున్న ఘనత జగపతిరావుకి దక్కుతుంది. అదే ఒరవడితో ఆయన కుమారుడు వెలిచాల రాజేందర్ రావు తనదైన శైలిలో అన్ని వర్గాల వారితో మమేకమవు తున్నారు. ప్రజలకు ఏ ఆపద వచ్చినా నేనున్నానంటూ అండగా ఉంటున్నారు. వారి సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నారు. కరీంనగర్ డిసిసి అధ్యక్ష పదవ రేసులోనూ ముందంజలో ఉన్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికలు పుష్కరకాలం తర్వాత జరుగుతున్నాయి. దీంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వెలిచాల రాజేందర్ రావ్ ప్రత్యేకంగా ఒక ప్యానల్ ఏర్పాటు చేశారు. నీతిమంతంగా నిజాయితీగా అంకితభావం పట్టుదల సామాజిక చేసే వారిని ఒక ప్యానెల్ గా ఏర్పాటు చేశారు. తన తండ్రి జగపతిరావు బాటలో రాజేందర్రావు నడుస్తున్నారు. తాను ప్రతిపాదించిన ప్యానల్ అభ్యర్థులు విజయం సాధించేందుకు పట్టువదలని విక్రమార్కుడిలా ప్రత్యేక ఒరవడితో ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ ప్యానల్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు. తమ బ్యాంకు అభ్యర్థులను ఎందుకు గెలిపించాలనే అవసరం పై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నారు. బ్యాంకు అభివృద్ధికి పాటుపడతారని ఎలాంటి అవినీతికి తావివ్వకుండా కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా తమ ఫ్యానల్ నడిపిస్తుందని, డిపాజిటర్ల నమ్మకాలను వమ్ము చేయరని స్పష్టం చేస్తున్నారు. ఇప్పుడున్న డిపాజిట్లను మూడింతలు పెంచుతామని నాలుగు కొత్త బ్రాంచ్ నుండి ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తున్నారు. చిన్న అవినీతి మరక అంటకుండా బ్యాంకు ను అభివృద్ధి బాటలో నడిపిస్తామని రాజేందర్ రావు చెబుతున్నారు. కరీంనగర్, గంగాధర, జగిత్యాల ప్రాంతాల్లో స్వయంగా పర్యటిస్తూ, తమ ప్యానెల్ అభ్యర్థులను గెలిపించాలని ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. జగిత్యాలలో విస్తృత ప్రచారం.ఈ నేపథ్యంలో...కరీంనగర్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉదయం జగిత్యాల జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంతో పాటు రోటరీ పార్క్, శ్రీ కాసుగంటి నారాయణరావు కళాశాల మైదానం, హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రాంతాల్లోని వాకర్స్ అసోసియేషన్ బృందాలను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ప్రత్యేకంగా కలిశారు. విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ప్యానెల్ అభ్యర్థుల వ్యక్తిత్వం చూసి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. గతంలో అవినీతి ఆరోపణలు ప్రత్యారోపణలు పనులు చేసుకున్న వారే మళ్లీ ఓటర్ల ముందుకు వచ్చి ఓట్లు అడగడం వింతగా ఉందని వారికి వివరించారు. తాము మంచి ప్యానెల్ ఏర్పాటు చేశామని వారిని ఆదరించాలని రాజేందర్ కోరారు. నీతిమంతమైన పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మద్దతుతో ఈ నియోజకవర్గ నుంచి నుంచి గాదె కార్తీక్, కూసరి అనిల్ ను తమ ప్యానెల్ లో అవకాశం కల్పించామని వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మద్దతు తమకు జగిత్యాల ప్రాంతంలో ఎంతో బలం వచ్చిందనీ, తమ ప్యానెల్ అభ్యర్థులు విజయం సాధించేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కరీంనగర్ తో పాటు అదనంగా జగిత్యాల ప్రాంత అర్బన్ బ్యాంక్ ఓటర్ల సభ్యుల సహకారంతో తమ ప్యానెల్ ఘన విజయం సాధించి తీరుతుందని రాజేందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. ఆయా ప్రాంతాల్లో వాకర్స్ ను కలిసి ప్రచారం నిర్వహించారు జగిత్యాల కు చెందిన గాదె కార్తీక్, వేణుగోపాల్ కూసరి అనిల్ కుమార్ తోపాటు తమ ప్యానెల్ అభ్యర్థులను గెలిపించాలని వెలి చాల రాజేందర్ రావ్ విజ్ఞప్తి చేశారు.

# లైంగిక వేధింపుల్లో హెచ్ఎం, సిబ్బంది పాత్రపై విచారణ కొనసాగుతోంది

**- అవసమైతే వారిపైనా పోక్సో కేసు నమోదు చేయాలి**
**- ఈ ఘటనపై కరీంనగర్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ సీరియస్ గా ఉన్నారు**
**- ప్రాథమిక విచారణ ఆధారంగా చర్యలు తీసుకుంటున్నారు**
**- పిల్లల భవిష్యత్తుతో ముడి పడి ఉన్న సమస్య దయచేసి మీడియా సంయమనం పాటించాలి**
**- ఆందోళనలో ఉన్న తల్లిదండ్రులకు భరోసా కల్పించాలి వంగరలో గురుకుల విద్యార్థి ఆత్మహత్య దారుణం**
**- బీఆర్ఎస్ పాలన తరహాలోనే కాంగ్రెస్ పాలన కొనసాగుతోంది**
**- ఇకనైనా గురుకులాలు, హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**
**- తెలుగు రాష్ట్రాలపై భారీ వర్షాల నేపథ్యంలో రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు**
**- అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కేంద్రం సిద్ధం**
**- కరీంనగర్ లో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి**



**చర్చ :- కరీంనగర్**
కరీంనగర్ జిల్లాలోని ఓ పాఠశాలలో యాకుబ్ భాషా అనే అటెండర్ విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం గత 5 రోజుల నుండే లోతైన విచారణ జరిపి నివేదిక తెప్పించుకున్నారని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. పోక్సో కేసు కావడంతో విషయం బయటకు వస్తే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందనే ఉద్దేశంతోనే ఈ విషయాన్ని బయటకు రానియ్యలేదన్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్ నిర్లక్ష్యం ఉన్నట్లు తేలడంతో ఈరోజు హెచ్ఎం ను కూడా సస్పెండ్ చేశారన్నారు. ఒకవేళ లైంగిక వేధింపుల విషయంలో హెచ్ఎం, ఇతర సిబ్బంది పాత్రపైనా విచారణ కొనసాగుతోందన్నారు. ఒకవేళ వారి పాత్ర కూడా ఉన్నట్లు తేలితే వారిపై పోక్సో కేసు నమోదు చేసేందుకు వెనుకాడొద్దని ఇప్పటికే జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ను కోరినట్లు తెలిపారు. ఈరోజు కరీంనగర్ లో ఓ ప్రైవేట్ చైల్డ్ రిహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ వద్ద మీడియా ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రస్తావించగా పై విధంగా స్పందించారు. "నిన్న కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో జరిగిన ఘటన దారుణం. ఇది పోక్సో కేసు. పిల్లల జీవితాలతో ముడిపడి ఉన్న సమస్య. దీనిని ప్రచారం చేయడంవల్ల వాళ్ల జీవితాలు ప్రమాదంలో పడతాయి. దయచేసి మీడియా సంయమనంతో వ్యవహరించాలి"అని అభ్యర్థించారు. "ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ గత 5 రోజుల నుండి లోతైన విచారణ జరిపించారు. నివేదిక తెప్పించారు. నిందితుడికి ఏ విధమైన ట్రీట్ మెంట్ ఇవ్వాలో ఆ ట్రీట్ మెంట్ ఇస్తున్నారు. ఈ వ్యవహారంలో హెడ్మాస్టర్ నిర్లక్ష్యం కూడా ఉన్నట్లు తేలింది. దీంతో ఆమెను సస్పెండ్ చేశారు. వారి పాత్ర ఉంటే వాళ్లపైనా పోక్సో కేసు పెట్టేందుకు వెనుకాడవద్దని అధికారులకు చెప్పాను. పిల్లలకు భరోసా ఇవ్వడంతోపాటు వారి తల్లిదండ్రులు ఆందోళన పడకుండా ధైర్యం కల్పించాలని కోరిన. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి భరోసా కల్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు."అని వివరించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని వంగర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని మీడియా ప్రస్తావించగా "వంగర గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య దారుణం. నిర్బంద విద్య కోసం ఇబ్బంది పెట్టకుండా విద్యార్థుల మానసిక పరిస్థితిని తెలుసుకుని అందుకు అనుగుణంగా వ్యవహరించాలి. దురదృష్టమేమింటే ఆనాడు బీఆర్ఎస్ హయాంలోనూ గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆత్మహత్యలు చేసుకున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలోనూ ఆత్మహత్యల పరంపర కొనసాగింది. నెలల తరబడి విద్యార్థులు ఆందోళన పట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పరిస్థితి మారుతుందేమోనని అందరూ భావించారు. కానీ కాంగ్రెస్ పాలనలోనూ ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. గురుకులాల, హాస్టళ్ల దుస్థితి మారలేదు. ఒక ఘటన జరిగితే అది మళ్లీ పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ప్రభుత్వం గురుకులాలను, హాస్టళ్లను గాలికి వదిలేయడంవల్లే ఈ దుస్థితి నెలకొంది. ఇకనైనా ప్రభుత్వంపై గురుకులాలు, హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా."అని వివరించారు. భారీ వర్షాల నేపథ్యంలో.మొంథా తుఫాను ప్రభావంవల్ల తెలుగు రాష్ట్రాలకు నేడు, రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహకాం ాలందించేందుకు సిద్దంగా ఉన్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇప్పటికే ఎన్డీఆర్ఎఫ్ టీంలను అలర్ట్ చేశాం. ఆంధ్రప్రదేశ్ లోని 19 జిల్లాల్లో వర్ష ప్రభావం భారీగా ఉన్నందున ఆ రాష్ట్రానికి అవసరమైన ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఇప్పటికే పంపించాం. ఎన్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నాం. అవసరమైతే అదనపు టీంలను పంపేందుకు సిద్దంగా ఉన్నాం. తెలంగాణలోనూ పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ఆయా జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ప్రాణ నష్టం లేకుండా చూడాలి. కేంద్రం పక్షాన అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్దంగా ఉన్నాం."అని పేర్కొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి


**- వర్షాల నేపథ్యంలో వరి కోతలు రైతులు తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలి**
**- సరైన తేమ శాతం వచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలి**
**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- ముష్టిపల్లిలో మెప్మా కొనుగోలు కేంద్రం తనిఖీ**






**చర్చ :- కరీంనగర్. రాజన్న సిరిసిల్ల**
జిల్లాలోని పంట ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మెప్మా ఆద్వర్యంలో ముష్టిపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంత వరకు ఎంత ధాన్యం వచ్చింది? ఎంత కొనుగోలు చేశారో ఆరా తీశారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్, నీటి, విద్యుత్ సరఫరా వసతి కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సరైన తేమ శాతం 17 వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వర్షాల నేపథ్యంలో ఇంకా వరి కోతలు మొదలు పెట్టని రైతులు రెండు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సిరిసిల్ల తహసిల్దార్ మహేష్ కుమార్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# సదరం క్యాంపును పరిశీలించిన జిల్లా కలెక్టర్







**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:**కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న దివ్యాంగుల వైకల్యం నిర్ధారణ క్యాంపును జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన క్యాంపులో దివ్యాంగుల వైద్య పరీక్షలు, ఆన్‌లైన్ దరఖాస్తుల ఎంట్రీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. దివ్యాంగులు ఆసుపత్రికి వచ్చిన క్రమంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను, సేవల లభ్యతను, నిర్ధారణకు ఉపయోగిస్తున్న పరికరాల పనితీరును కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రతి దివ్యాంగుడికి అవసరమైన గుర్తింపు, సర్టిఫికేట్ అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ కార్డులు తెలంగాణ రాష్ట్రంతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కూడా వర్తిస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్డుల ద్వారా దివ్యాంగులు ఆరోగ్య, విద్య, ఉపాధి, రవాణా వంటి రంగాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందగలరని పేర్కొన్నారు. ప్రతి దివ్యాంగుడు సమాజంలో సమాన హక్కులు, అవకాశాలు పొందేలా ప్రభుత్వ యంత్రాంగం సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా యూడీఐడీ కార్డుల కోసం దరఖాస్తు చేసిన దివ్యాంగులకు ఆసుపత్రిలో వైకల్యం నిర్ధారణ కోసం సదరం స్లాట్ బుకింగ్ చేయాలని, ముందుగానే దరఖాస్తుదారులకు సమాచారం అందించి సమయానికి పరీక్షలు జరిగేలా చూడాలని ఆయన సూచించారు. వైద్య పరీక్షల సమయంలో అవసరమైన వైద్య నిపుణులు, పరీక్షా పరికరాలు, సాంకేతిక సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే క్యాంపు ప్రాంతంలో దివ్యాంగులు ఇబ్బంది పడకుండా రిసెప్షన్ సెంటర్, కుర్చీలు, నీడ, తాగునీరు, టాయ్‌లెట్స్, ర్యాంప్, వీల్‌చెయిర్ వంటి ప్రాథమిక వసతులు కల్పించాలని సూచించారు. దివ్యాంగులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావించాలని ఆయన అన్నారు. పరీక్షల అనంతరం ప్రతి దివ్యాంగుడి వైకల్యం శాతం, వ్యక్తిగత వివరాలు, వైద్య నిపుణుల సర్టిఫికేషన్ వివరాలను సమగ్రంగా యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేయాలని, ఎటువంటి లోపాలు లేకుండా డేటా ఎంట్రీ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దివ్యాంగుల సమాచారం డిజిటల్ రూపంలో భద్రపరచడం వల్ల భవిష్యత్తులో వివిధ పథకాల అమలుకు అది బలమైన ఆధారంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, వైద్య నిపుణులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చు

**- సత్తుపల్లి ఆర్టీసీ డీఎం ఊటుకూరి సునీత**





**చర్చ,సత్తుపల్లి:**అప్రమత్తతతోనే ప్రమాదాలను చాకచక్యంగా నివారించవచ్చని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ఊటుకూరి సునీత పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు, నివారణ పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. దీనిలో భాగంగా మంగళవారం సత్తుపల్లి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్స్‌కు అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక అదనపు అధికారి వై.వెంకటేశ్వర రావు సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్యాస్ లీకైన సమయంలో, ప్రమాదాల్లో గాయపడినవారికి ప్రథమ చికిత్స, ముఖ్యంగా ఇళ్లలోని వంట గదిలో గ్యాస్ లీకేజ్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను అదుపులోకి తీసుకొచ్చే పరికరాలు, ఏ సమయంలో ఎలాంటి పరికరాలు ఉపయోగించాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలు ఏదైనా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు వెంటనే 101 కి సమాచారం అందించాలన్నారు. అప్రమత్తతతోనే ప్రమాదాలను చాకచక్యంగా నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీ, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి పొంగులేటి పుట్టినరోజు వేడుకలు

**- కేక్ కట్‌చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి**



**చర్చ, సత్తుపల్లి:**సత్తుపల్లి పట్టణం ద్వారకాపురి కాలనీ నందుగల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణం, మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లడుతు రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, మండలం అధ్యక్షులు శివా వేణు, సత్తుపల్లి పట్టణం, మండలం కాంగ్రెస్ నాయుకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయుకులు, ఎన్ఎస్‌యుఐ నాయుకులు, తదితరులు పాల్గొన్నారు

# ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో పొంగులేటి జన్మదిన వేడుకలు



**చర్చ, సత్తుపల్లి:**స్థానిక సింగరేణి జేవిఆర్ ఓసి, సిహెచ్‌పి, కిష్టారం ఓసి మైన్‌లలో ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఫిట్ సెక్రటరీలు రామారావు, బాలాజీ, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ యూనియన్ ఐఎన్‌టియుసి కొత్తగూడెం రీజియన్‌లో ఇల్లందు, కొత్తగూడెం, మణుగూరు, కార్పొరేట్‌ల గెలుపుకు పొంగులేటి కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి వివిధ కమిటీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, డిఎల్ఆర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పిడిఎస్‌యు 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**- ఆహ్వాన సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ భూక్యా రమేష్**




**చర్చ, సత్తుపల్లి:**సమ సమాజ స్థాపన కోసం, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) ఖమ్మం జిల్లా 23వ మహాసభలు సత్తుపల్లి పట్టణంలో నవంబర్ 4వ తేదీన నిర్వహించడం జరుగుతుందని, ఈ మహాసభలకు సామాజిక స్ఫూర్తితో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ భూక్యా రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక నీలం రాంచంద్రయ్య భవన్ నందు ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగంలో తీసుకు వస్తున్న విద్యార్థి వ్యతిరేక సంస్కరణలపై పోరాడాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఎన్నో సామాజిక, ప్రజాతంత్ర విప్లవోద్యమాలకు పురిటిగడ్డ ఆయన చారిత్రాత్మక సత్తుపల్లి కేంద్రంలో పి.డి.ఎస్.యు ఖమ్మంజిల్లా మహాసభల నిర్వహణకు పూనుకుంటున్నామని, ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యార్థులు మహాసభల విజయవంతానికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమం లో పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, నాయకులు నవీన్, ఈశ్వర్, సాధిక్ పాషా, ఫారిద్, చేన్నకేశ్వర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం!





**చర్చ, అశ్వారావుపేట:**దమ్మపేట మండల కేంద్రంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా టాటా పంచ్ కారు అగ్నికి ఆహుతి అయ్యింది. నల్లపోతుల నాగరాజు అనే ప్రభుత్వ టీచర్ తన టిఎస్ 28 8621 నంబర్ గల కారును మంగళవారం ఇంటి బయట పార్క్ చేసి, తాను ఇంట్లోకి వెళ్లగా కారు నుండి పొగలు రావడం ప్రారంభమై కారు మొత్తం వ్యాపించాయి. మంటలు అదుపు చేయడానికి స్థానికులు ప్రయత్నించినప్పటికీ వారి ప్రయత్నాలు విఫలమై కారు అద్దాలు, టైర్లు మంటలు ధాటికి పెద్ద పెద్ద శబ్దాలతో పేలిపోవడంతో కారు దగ్గరికి వెళ్లడానికి ఎవరూ సాహసించలేదు. స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చినప్పటికీ కారు ఉన్న ప్రాంతానికి ఫైరింజన్ రావడానికి రహదారి అనుకూలంగా లేకపోవడంతో కారు మంటల్లో పూర్తిగా కాలిపోయింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు అంటున్నారు.

## పాస్టర్స్, ఇవాంజిలిస్ట్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



**చర్చ, వైరా:** వైరా పాస్టర్స్, ఇవాంజిలిస్ట్స్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం స్థానిక షారోను ప్రార్థన మందిరంలో అసోసియేషన్ పెద్దలు పాస్టర్లు ఝెహోషువ, సుధాకర్, కోర్నెలిల ఆధ్వర్యంలో ఎన్నుకునా్రను. అధ్యక్షుడిగా పాస్టర్ బందుల స్టీవెన్ ప్రేమ్ సన్, కార్యదర్శిగా సిహెచ్ ఝెహెజ్కెల్, ఉపాధ్యక్షుడిగా టి.శాంసన్, కోశాధికారిగా కోటా ఇశ్రాయేల్, సహాయ కార్యదర్శిగా జి.శ్యామ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కల్లూరులో పొంగులేటి జన్మదిన వేడుకలు



**చర్చ, సత్తుపల్లి:**కల్లూరు పట్టణంలోగల టిటిడి కల్యాణ మండపం నందు కల్లూరు కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి హాజరై మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి, మండలం సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడుమర్తి చంద్రరావు, కల్లూరు మండలం కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నేడు కార్పొరేషన్ ఆఫీస్ వద్ద ధర్నా: వై. విక్రమ్



**చర్చ, ఖమ్మం:**నగరంలో పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలపై బుధవారం ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నట్లు సిపిఎం ఖమ్మం డివిజన్ సెక్రటరీ వై విక్రమ్ తెలిపారు. మంగళవారం పార్టీ టూ టౌన్ మండల కమిటీ సమావేశం సుందరయ్య భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో గత కొన్ని సంవత్సరాలుగా అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇంటి పథకం కూడా నత్తనడకన సాగుతోందని ఆరోపించారు. అర్హులైన వారికి కొత్తగా పెన్షన్లు ఇవ్వడం లేదని, కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ పేదలు చెప్పులు అరిగేలా తిరుగుతున్నారని విమర్శించారు. 2 వేల పెన్షన్ పెంచుతామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. నూతన రేషన్ కార్డులు ఇస్తామని హడావిడి చేయగా, అసలైన అర్హులకు రేషన్ కార్డులు అందలేదని పేర్కొన్నారు. నగరంలో ప్రధానమైన రహదారులు విస్తరణ చేయాలని కొద్దికాలంగా ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కొన్ని రహదారులు విస్తరణ పేరుతో సగం, సగం చేసి వదిలేశార ని, ఫలితంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లో అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నగరంలో నెలకొన్న ప్రజా సమస్యలపై నిర్వహించే ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు జె. వెంకన్న బాబు, చిన్న హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు చిత్తశుద్ధితో వైద్య సేవలు అందించాలి

- బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి
- ఇంఛార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించిన ఇంఛార్జి కలెక్టర్
- సదరం శిబిరం పరిశీలన







**:- కరీంనగర్. సిరిసిల్లచర్చ**
వైద్యులు రోగులకు చిత్తశుద్ధితో వైద్య సేవలు అందించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఇంచార్జి కలెక్టర్ మంగళవారం సందర్శించారు.ముందుగా దవాఖానలోని మెటర్నిటీ, ఆప్తమాలజీ, ఎమర్జెన్సీ వార్డులు, రక్త పరీక్షల ల్యాబ్‌ను పరిశీలించారు. వైద్య సేవలు పొందుతున్న వారితో మాట్లాడి, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు చిత్తశుద్ధితో సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి ఆదేశించారు. రోగులకు మెరుగైన, సంతృప్తికరమైన వైద్య సేవలు అందించడం వైద్యుల ప్రథమ కర్తవ్యంగా భావించాలని సూచించారు.శిబిరానికి ఎందరు వచ్చారు? దవాఖానలోని గ్రౌండ్ ఫ్లోర్ లో ఆర్థోకి సంబంధించిన సదరం శిబిరం నిర్వహిస్తుండగా, ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. సదరం రిజిస్ట్రేషన్లు, వైద్య పరీక్షలు, వివరాల నమోదు, తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడి సౌకర్యాల తీరును ఆరా తీశారు. మొత్తం 50 మందికి ఆర్థోకి సంబంధించిన పరీక్షలు చేస్తున్నామని ఇంచార్జి కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకువెళ్ళారు.సదరం శిబిరానికి రావడానికి మీరు ఎప్పుడు స్లాట్ బుక్ చేసుకున్నారు? ఈరోజు శిబిరానికి రావాలని మా సిబ్బంది మీకు ఫోన్ చేశారా లేదా అని ఆరా తీశారు.శిబిరం నిర్వహణకు సంబంధించిన వివరాలను వైద్యులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారుశిబిరానికి వచ్చే వారి కోసం గదిలో మౌలిక వసతులు కల్పించాలని, ఫర్నిచర్ ఇతర ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దివ్యాంగులకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు.కార్యక్రమంలో జీ జీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్, డీఆర్డీఓ శేషాద్రి, వైద్యులు సంతోష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, డీపీఎం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల అటెండర్ యాకూబ్ పాషా అరాచకాలు బట్టబయలు



**చర్చ :- కరీంనగర్** పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అండదండలతోనే అటెండర్ యాకుపాషా అరాచకాలు? కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను అటెండర్ యాకూబ్ పాషా లైంగిక వేధింపుల ఘటనలో జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ జాయింట్ ఆపరేషన్ లో ఎన్నో సంచలన విషయాలు బయట పడ్డాయి... యాకుబ్ బాషాకు సంబంధించి పోక్సో కేసు కావడంతో వివరాలు బయటకు పొక్కకుండా మంగళవారం రహస్య విచారణ చేపట్టారు. కొన్ని విస్తుబోయే నిజాలు బయటపడ్డాయి.బాలికలపై గత కొంత కాలంగా అటెండర్ యాకుబ్ భాషా, లైంగిక వేధింపులకు పాల్పడ్డట్లు నిర్ధారణ అయింది.తరగతి గదిలో, విశ్రాంతి గదుల్లో బాలికల పట్ల అత్యంత అసభ్యకరం గా జుగుప్సాకరంగా వ్యవహరిస్తున్నాడని, యాకుబ్ పాషాపై చర్యలు తీసుకోవాలని గతంలోనే బాలికలు స్కూల్ హెడ్ మాస్టర్, కమలకు ఫిర్యాదు చేశారు. కాగా యాకుబ్ పాషాను పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు కమల, వెనుకేసు కొచ్చారు. ఈ విషయం ఎవరికైనా చెబితే టీసీ ఇచ్చి ఇంటికి పంపిస్తాను అని హెడ్మాస్టర్ కమల పదవ తరగతి బాలికలను బెదిరించారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బాలికలు భయపడి ఎవరికి చెప్పలేకపోయారు. టీసీ ఇస్తే మా భవిష్యత్తు ఏమైపోతుందోనని,వాడీ అరాచకాలు భరించారు. హెడ్మాస్టర్ కమల అండదండలతోనే అటెండర్ యాకూబ్ పాషా, ఈ దారుణాలకు పాల్పడ్డాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. జిల్లా కలెక్టర్. తీగలాగితే డొంక కదిలినట్లుగా త్రిసభ్య కమిటీ విచారణతో యాకు బ్ భాషా అరాచకాలు ఒక్కొక్కటి బయటపడు తున్నాయి... బాలికల బాత్రూంలో సీక్రెట్ కెమెరా లు బయటపడడం తో ఈ వ్యవహారం పై కలెక్టర్ సీరియస్ గా తీసుకున్నారు వెంటనే హెడ్మాస్టర్ కమలను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే క్రిమినల్ చర్యలకు వెనకాడకూడదని కలెక్టర్ పోలీస్ అధికారు లకు సూచించారు. యాకూబ్ షాషాకు అను కూలంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఒకరిద్దరు అధికారుల తప్పిదాలవల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరొస్తుందని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి








**చర్చ :- కరీంనగర్** ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఈనెల 27 నుండి వచ్చే నెల రెండు వరకు నిర్వహిస్తున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం అధికారులతో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవల్లో నిజాయితీ పెంపొందించాలని అన్నారు. ప్రజా సేవలో పారదర్శకత, బాధ్యత చాలా ముఖ్యమని తెలిపారు. ప్రతి ఉద్యోగికి పనిలో జవాబుదారీతనం ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ హెల్ప్ లైన్ నెంబర్ 14432, లోగో కు సంబంధించిన పోస్టర్ను విడుదల చేశారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఆర్డీవో మహేశ్వర్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదు

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవు
- ఎస్పీ రోహిత్ రాజు




**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:**పోలీసు అధికారులు కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రోహిత్ రాజుహెచ్చరించారు. నిషేధిత గంజాయిని రవాణా చేసే వారిపైనే కాకుండా, సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని, 'చైతన్యం%-%డ్రగ్స్ పై యుద్ధం' కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ రవాణాను అరికట్టడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయం నుంచి జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూ కోర్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. నిషేధిత గంజాయి అక్రమరవాణా, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, చైతన్యం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్‌ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతోపాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దొంగతనం కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను, వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలన్నారు ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లాలోని సిఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# కిబాలా" పేరుతో వందకోట్ల ఆస్తి కబ్జా

- ఆక్రమణ దారులు యాజమాన్య హక్కులకై పోరాడలే
- ఎప్పుడు ఇంజక్షన్ అర్డర్ల కోసం ఆరాటమే
- అక్రమ ఆస్తుల స్వాధీనం కోసం ముఖ్య మంత్రికి లేఖ
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి




**చర్చ, జగిత్యాల, అక్టోబర్ 28:** దేశానికి స్వాతంత్రం వచ్చిన తొలినాళ్ళలో దేశ ప్రజలను చీకట్లనుంచి విముక్తి కల్పించేందుకు అప్పటి కేంద్ర ప్రభుత్వం కిరోసిన్ విక్రయాలకై నియమించిన డీలర్లలో దారం వీరమల్లయ్య ఒకరని ఆనాడు కిరోసిన్ అమ్మకానికి ఎంచుకొన్న స్థలమే నేడు కబ్జా కు గురయ్యిందని జగిత్యాల సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన క్రమంలో దేశంలో విద్య, వైద్య రంగాలతోపాటు విద్యుత్, తాగునీటి సదుపాయాల కల్పన కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఆ క్రమంలోనే కొంత సైన్స్ పరిజ్ఞానం ఉన్న వారికి మెడికల్ షాపుల నిర్వాహణ, ప్రజల అవసరాలకై కిరోసిన్ విక్రయ కేంద్రాల ను ఇచ్చారన్నారు. ఆలా ప్రస్తుత కొత్త బస్టాండ్ ప్రాంతంలో కిరోసిన్ విక్రయానికి దారం వీర మాల్లయ్య విక్రయించేవారన్నారు. అప్పుడు వివిధ గ్రామాల నుంచి బీట్ లోకి ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులు ఇక్కడ కిరోసిన్ కొనుగోలు చేసి తీసుకొని పోయే వారన్నారు. ఆలా కిరోసిన్ విక్రయ దారుడిగా నిలిచిన దారం వీర మల్లయ్య కాల క్రమేణా కిరోసిన్ డీలర్, పెట్రోల్, డీజిల్ విక్రయ దారుడిగా కొనసాగాడన్నారు. కాలక్రమేణా పట్టణం విస్తరణ జరగడం, కొత్త బస్టాండ్ ప్రాంతం వ్యాపార పరంగా వృద్ధి చెందుతు వచ్చిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే ఈ అంశంను కొందరు లేవనేత్తడంతో ప్రభుత్వం దృష్టిలో చేరిందన్నారు. ఇదే అంశంలో మున్సిపల్ పరంగా నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. కాని ఇప్పటి వరకు కోర్టు కైనా, మున్సిపల్ కైనా యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు అందజేయలేదని జీవన్ రెడ్డి అన్నారు. 1994 లో మాస్టర్ ప్లాన్ అమలుకోసం రోడ్డు 60 ఫీట్లు వరకు ఆమోదం పొందగా, సహజంగా భూసేకరణ చేస్తే నిజమైన యాజమాన్య హక్కులు ఉంటే, పరిహారం కోసం కోర్టు నైనా ఆశ్రయించే వారన్నారు. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న వారిని బుజ్జగించి, ఒప్పించి, మెప్పించి 60 ఫీట్ల వరకు విస్తరించినం. టవర్ రోడ్డు సైతం విస్తరించమని అన్నారు. 100 ఫీట్ల రోడ్డు విస్తరణ కోసం మునిసిపల్ లో ప్రతిపాదనలు చేసినా అప్పటి ప్రభుత్వ పాలనలో అమలుకు నోచుకోలేదు. అనంతరం మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందిందని అన్నారు. న్యూ బస్టాండ్ వద్ద 1952 ప్రాంతంలో పెట్రోల్, డీజిల్, దుకాణం లేకపోవడం తో ప్రజా అవసరాల కోసం దారం వీర మల్లయ్య కు మున్సిపల్ 20 గుంటల భూమి కేటాయింపు చేశారని చెప్పారు. 1952 లో మున్సిపల్ 20 గుంటలు పెట్రోల్, డీసెల్, కిరోసిన్ పంపు ఏర్పాటు కోసం కిబాల రెండు వేల రూపాయల విలువతో కేటాయించిందన్నారు. భూమికి సంబంధించిన పత్రాలు సమర్పించాలని మున్సిపల్ కోరినా, దారం వీరమల్లయ్య జీవిత కాలంలో ఎటువంటి ఆధార పత్రాలు సమర్పించలేదు. కిబాల 1975 వరకు మున్సిపాలిటీకి సమర్పించలేకపోయారన్నారు. దారం వీరమల్లయ్య మరణంనం తరం వారి వారసులు కిబాలాను తెర పైకి తీసుకు వచ్చారని, కిబాల 1952 లో కేటాయించినట్లు పేర్కొన గా, 1958 లో పత్రం తయారీ అయినట్లు తేలిందని చెప్పారు. మున్సిపాలిటీ నోటీసులు జారీ చేయటంతో ఆక్రమణ దారులు కోర్టును ఆశ్రయించడం జరిగిందని, ఇప్పటివర కుఅక్రమనదా రులు ఇంజెక్షన్ కోసం కోర్టు కు వెళ్ళారే కానీ ఏనాడు యాజ మాన్య హక్కుల టైటిల్ కోసం కోర్టులను ఆశ్రయించలేదని అన్నారు. దారం వీర మల్లయ్య వారసులకు కోర్టులు ఎక్కడ కూడా యాజమాన్య హక్కులు నిర్ధారించలేదని జీవన్ రెడ్డి చెప్పారు. 2004 లో మున్సిపల్ ఆస్తులు రక్షించాలిని, అక్రమ దారులను తొలగించాలని, జగిత్యాల మున్సిపల్ సబ్ కమిటీ వేయగా, వివిధ అంశాలు పరిశీలించి, కి బాల అనుమాస్పదంగా ఉందని తేల్చారని అన్నారు. పెట్రోల్ బంక్ కేవలం 4 గుంటల్లో మాత్రమే ఏర్పాటు చేశారని, మిగిలిన 16 గుంటల భూమి స్వాధీనం చేసుకోవాలని మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసిందన్నారు. యాజమాన్య హక్కులు లేకుండానే క్రయ, విక్రయాలు చేశారని ఇది చట్టరీత్యా నేరమన్నారు. వీరమల్లయ్య సోదరుడు పురుషోత్తం వారసత్వ ఆస్తిగా భాగాలు చేసుకున్నారన్నారు. రెవెన్యూ రికార్డులలో 1954- 55 కాశ్ర పహాని లోగానీ, పహానిలో గాని పేరు నమోదు కాలేదు. కేవలం కబ్జా కాలంలో మాత్రమే పేర్కొన్నారు. పెట్రోల్ పంపు కోసం కేటాయించిన భూమి మినహా 16 గుంటల భూమి స్వాధీనం చేసుకోవాలనే మున్సిపల్ తీర్మానం 140 రద్దు చేయాలని మరో రిట్ వేశారన్నారు. మున్సిపల్ 140 తీర్మానం రద్దు చేయాలనే రిట్ చెల్లదని, యాజమాన్య హక్కుల కోసం సివిల్ కోర్టు కు వెళ్లాలని కోర్టు ఆదేశించిందని జీవన్ రెడ్డి అన్నారు. రోడ్డు విస్తరణకు సంబంధించి ప్రొసీజర్ ఫాలో కావాలని మాత్రమే కోర్టు సూచించిందని ఈ సందర్భంగా తెలిపారు. 1952 లో పెట్రోల్ డీసెల్, కిరోసిన్ పంపు కోసం భూమి కేటాయించినట్లు గా పేర్కొనగా, 1958 లో అమలు చేసినట్లు గా ఉందని కోర్టు తెలిపిందన్నారు. కిబాలను దారం వీర మల్లయ్య మున్సిపల్ కు జీవిత కాలం సమర్పించకపోవడం కిబాలపై అనుమానంగా ఉందని ప్రకటించడం జరిగిందన్నారు. ఒకానొక సందర్భంలో దారం పురుషోత్తం యాజమాన్య హక్కులు లేవని కబ్జాలో మాత్రమే ఉన్నామని చెప్పారని జీవన్ రెడ్డి చెప్పారు. దారం వీర మల్లయ్య కబ్జా లో మాత్రమే ఉన్నారని, యజమాని అయి ఉంటే పట్టదార్ కాలం నంబర్ 8 లో నమోదు చేసేవారని, పిటిషనర్ కోర్టుకు సమర్పించిన పత్రంలో సైతం పట్టాదారు కాలమ్ లో పేరు లేనిది సమర్పించారని కోర్టు పేర్కొందని అన్నారు. సహజంగా మున్సిపాలిటీ ప్రభుత్వ అనుమతి లేకుండ భూమి కేటాయించరాదని, ప్రభుత్వ అనుమతి పొందినట్లు ఏవిధమైన ఆదారాలు లేవని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ కౌన్సెల్లో చేసిన తీర్మానం ఇప్పటికీ తీర్మానం అలాగే అమల్లో ఉందని, దారం వీర మల్లయ్య వారసులు యాజమాన్య హక్కులు ధృవీకరించుకోలేదని, పహనీలో పేరు నమోదు కాలేదని, కి బాలా అనుమానంగా ఉందని అన్నారు. యాజమాన్య హక్కుల ధృవీకరణ కోసం కోర్టు కక్షిదారులకు సూచనలు చేసిందని కాని ఇప్పటి వరకు ఆదిశగా ప్రయత్నాలు జరగలేదాన్నారు. కోర్టు తీర్పు వచ్చి 16 సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు కోర్టును ఎందుకు ఆశ్రయించలేదో చెప్పాలని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగా కోర్టును ఆశ్రయించడం లేదనియాజమాన్య హక్కులు నిరూపించుకోకుంటే 20 గుంటల పై ఆస్తి హక్కు ఉండదని సూచించారు. ఏ విధమైన యాజమాన్య హక్కులు లేకుండా సుమారు 100 కోట్ల ఆస్తిని అక్రమంగా అనుభవిస న్నారని, హై కోర్టు ఉత్తర్వులు కూడా దారం వీర మల్లయ్య వారసులకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్ కోసం కేటాయించిన భూమిని ఇతర అవసరాలకు వినియోగించడం చట్టపరంగా చెల్లదన్నారు. నిజంగా యాజమాన్య హక్కులు ఉంటే కోర్టును ఎందుకు ఆశ్రయించలేదని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. జగిత్యాల పట్టణంలోని మున్సిపాలిటీకి చెందిన సర్వే నంబర్ 138 లో ఏవిధమైన యాజమాన్య హక్కులు లేకుండా అక్రమ స్వాధీనంలో ఉన్న ఆస్తులను మున్సిపల్ స్వాధీనం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ, మున్సిపల్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కు లేఖలు రాస్తామని అన్నారు. ప్రభుత్వ ఆస్తులు రక్షింప చేయడం ప్రతి పౌరుడి, ప్రతి ప్రజా క్రని అన్నారు. అలాగే రాజ్యంగంలో నాలుగో పిల్లర్ గా పేర్కొన్న పాత్రికేయులపై కూడా ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ఉందని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి అన్నారు.

## ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు క్యాష్ అవార్డులు



**చర్చ, సత్తుపల్లి:** సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో అత్యధిక ఈపీకే తెచ్చిన కండక్టర్లు, కేఎంపిఎల్ తెచ్చిన డ్రైవర్లకు క్యాష్ అవార్డులు, ప్రశంశా పత్రాలను ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావుతో కలిసి ఆర్టీసీ డీఎం ఊటుకూరి సునీత అందజేశారు. మంగళవారం డిపో ఆవరణలోజరిగిన కార్యక్రమంలో డీఎం సునీత మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి అత్యధిక ఈపీకేతోపాటు కేఎంపీఎల్ తీసుకు రావాలని కోరారు. ప్రయాణీకులపట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ, సురక్షితంగా వారిని గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ప్రజలు ఆర్టీసీపై నమ్మకం పెట్టుకుని ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం చేయాలని విజ్ఞప్తి చేవారు. చ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ ఎస్.సాహితీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

## వనికిస్తున్న మొంథా తుఫాన్



**చర్చ:- అశ్వారావుపేట** ఉమ్మడి తెలుగు రాష్ట్రాలపై మొంథా తుఫాను ప్రభావంతో తెలుగు రాష్ట్రాల ప్రజలు వనికిపోతున్నారు. కాకినాడ కు సమీపంలో కేంద్రీకృతం అయిన తుఫాన్ తీరప్రాంతాల వారికి నిద్రలేకుండా చేస్తుంది. గత మూడు రోజులుగా ఏడితేరాపీ లేకుండా కురుస్తున్న వర్షాలకు కేవలం ఆంధ్రా ప్రాంతమే కాకుండా తెలంగాణా రాష్ట్రంలోని సరిహద్దు ప్రాంతాలు కూడా మొంథా తుఫాన్ ప్రభావానికి గురి అవుతున్నయి. అందులో భాగంగానే అశ్వారావుపేట నియోజకవర్గం లోని అన్ని మండలాలకు మొంథా తుఫాన్ ప్రభావం చూపుతుంది. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ఇదురుగాలులు వీస్తు ప్రజలను ఇళ్ళకే పరిమితం చేసే పరిస్థితికి వచ్చింది. వ్యవసాయధారులు వేసిన పంటల పరిస్థితి ఏమిటో అర్థం కాక తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది. చేతికి వచ్చిన పంట ఎక్కడ నాశనం అవుతుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి, మినుములు, వరి, అన్ని పంటలు చేతికి వచ్చే సమయానికి ఉలాంటి ఉపద్రవం రావడంతో దిక్కుతోచక అయోమయంలో పడ్డారు.

# వాడవాడలా పొంగులేటి జన్మదిన వేడుకలు

- బైక్ ర్యాలీ, రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాల నిర్వహణ
- వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి













**చర్చ, ఖమ్మం:** రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వాడవాడలా ఘనంగా నిర్వహించారు. పొంగులేటి అభిమా నులు బైక్ ర్యాలీలు నిర్వహించగా, పురవీధులన్నీ శ్రీనివాసరెడ్డి కటౌట్లు, ఫ్లెక్సీలు, భారీ హెర్డింగ్‌లతో నింపేశారు. ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో ఇన్‌చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి అన్నదానం చేశారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి హాజరై కేక్ కటింగ్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. వరంగల్ క్రాస్ రోడ్డులో వెంపటి రవి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేయగా, మెఫీ మానసిక వికలాంగుల కేంద్రంలో భూక్య సురేష్ నాయక్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తిరుమలాయపాలెం మండలంలో బెల్లం శ్రీను ఆధ్వర్యంలో, ముదిగొండ మెయిన్ సెంటర్‌లో దేవరపల్లి అనంతరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎం.వి.పాలెంలో మందపల్లి నాగమణి, గ్రెయిన్ మార్కెట్ ఏరియాలో భీమనాథుల అశోక్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు నిర్వహించగా, ఖానాపురంలోని శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వాములకు డీసీసీ నాయకులు గుర్రాల శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాల్వఒడ్డులో అన్న క్యాంటీన్‌లో మద్ది కిశోర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం, 60వ డివిజన్ కార్పొరేటర్ బద్దె నిరంజన్ ఆధ్వర్యంలో రామన్నపేటలో కేక్ కటింగ్, అన్నదానం, ఖమ్మం నగరంలో పారా ఉదయ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథబాబు ఆధ్వర్యంలో వెంకటగిరిలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

## వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవా లి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నల్గొండ జిల్లా చర్చ ప్రతినిధి** ధాన్యం కుప్పల వైపు వర్షపు నీరు రాకుండా కాలువలు తీసి నీటిని మళ్లించాలని అన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని చెప్పారు. మంగళ వారం ఆమె కట్టంగూరు మండలం, ఐటిపాముల, కట్టంగూరు, రెడ్డి కాలనీలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తేమశాతం సరిగా ఉంటే తాలు, తరుగు వంటివి లేకుండా ఉంటే తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని ఆదేశించారు. ఎక్కడైనా హమాలీల కొరత ఉంటే ఎక్కువ మందిని ఏర్పాటు చేసి వెంటనే ధాన్యం మిల్లులకు వెళ్లేలా చూడాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలో కొనుగోలు కేంద్రాలలో ఉన్న దాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. మొంతా తుఫాన్ దృష్ట్యా రైతులు వర్షాలు తగ్గేవరకు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా మిల్లర్లు, లేదా లారీల సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ ,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డి సి ఓ పత్యా నయ్క్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ ,నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, తదితరు

# సీఎస్ఆర్ నిధులను నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలి

- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి



**చర్చ, మణుగూరు:** బిటిపిఎస్, సిఎస్ఆర్ నిధులను నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలని, రోడ్లు, డ్రైనేజీలు, విద్యా, వైద్యం, విద్యుత్తు, త్రాగునీరు తదితర మౌలిక సమస్యలను పరిష్కరించాలని, మణుగూరు నుండి బయ్యారం క్రాస్ రోడ్ వరకు రోడ్డు నిర్మాణం చేసి ప్రమాదాలు నివారించాలని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మాస్ లైన్ ఆధ్వర్యంలో బిటిపిఎస్ గేట్ ముందు ధర్నా నిర్వహించి, సీఈ బిచ్చన్నకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అంగట్లో అన్ని ఉన్నా అల్లుడు నోట్లో శని ఉన్నట్లు కోట్లాది రూపాయల బీటీపీఎస్, సిఎస్ఆర్ నిధులు వస్తున్నా నిర్వాసిత గ్రామాలలో సరైన రోడ్లు, డ్రైనేజీలు, విద్యా, వైద్యం, విద్యుత్తు, త్రాగునీరు తదితర మౌలిక సదుపాయాలు లేవన్నారు. ఒకప్పుడు పచ్చని పైరులతో, ప్రశాంత వాతావరణంలో ఉన్న నిర్వాసిత గ్రామాలు నేడు దుమ్ము, ధూళితో దర్శనమిస్తున్నాయన్నారు. వాతావరణ, పర్యావరణ కాలుష్యం వలన ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. నిర్వాసిత గ్రామాల ప్రజలు ఇన్ని సమస్యలతో ఇబ్బంది పడుతున్నా నిర్వాసిత గ్రామాల అభివృద్ధి పట్ల ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు అన్నారు. బిటిపిఎస్, సిఎస్ఆర్ నిధి కింద సుమారు రూ.20 కోట్లు ఇప్పటివరకు చెల్లించారని, ఈ నిధులు నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి ఉపయోగించకుండా దారి మళ్ళించడం వలన నిర్వాసిత గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి, సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే తమ పార్టీ ఆధ్వర్యంలో కలిసి వచ్చే అన్ని పార్టీలను, సంఘాలను కలుపుకొని ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి గిరిజన సంఘం నాయకులు చిడం. నాగేశ్వరరావు, వజ్జా. శ్యామ్, కాయం. తిరుపతమ్మ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు కురసం. రామకృష్ణ, ఇందారపు వెంకట్ నర్సయ్య, అలవాల సమ్మన్న, ముషిక లక్ష్మణ్, రావులపల్లి ప్రభాకర్, పి. సంజీవరెడ్డి, మిట్టపల్లి. రాజేందర్, ఎల్లు లక్ష్మయ్య, రామచంద్రు, లక్ష్మి, సరోజన, భవాని, వెంకటమ్మ, ప్రసాదు, సురేష్, శివ, మైబురెడ్డి, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- తీర్పు వెల్లడించిన పోక్సో స్పెషల్ జడ్జి ఎస్.చరిత

**చర్చ, మణుగూరు/భద్రాద్రి కొత్తగూడెం:** పోక్సో కేసులో వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి (పోక్సో స్పెషల్ జడ్జ్. అదనపు ఛార్జ్) ఎస్.సరిత మంగళవారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. మణుగూరు మండలం జానంపేటకు చెందిన గాడిద శ్రీనివాస్ అనే వ్యక్తి ది.12.06.2024న వాగుమల్లారం గ్రామానికి చెందిన మైనర్ బాలికపై ఆగాయిత్యం చేయగా అప్పటి ఎస్సై సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ బి.రవీందర్ రెడ్డి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టులో 11 మంది సాక్షులను విచారించగా, శ్రీనివాస్‌పై నేరం రుజువు కావడంతో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేల జరిమానా జరిమానా చెల్లించాలని, జరిమానా చెల్లించనిపక్షంలో మరో ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జడ్జి ఎస్. సరిత తీర్పు చెప్పారు. మాధితురాలి తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి వాదించగా, కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్సై డి. రాఘవయ్య ,లైజన్ ఆఫీసర్ సయ్యద్ అబ్దుల్ ఘని, అశోక్ లు సహకరించారు.

## మండలం మొత్తానికి అధికారినే అయిన విద్యానగర్ పంచాయతీ నా పరిధి కాదు - చుంచుపల్లి మండల ఎంపీఓ

- విద్యానగర్ పంచాయతీలోని రోడ్లకు ఇరు ప్రక్కల డ్రైనేజీలను నిర్మించాం, వాటిపై నిర్మించిన షాపులు పంచాయతీ ఈవో పరిధిలోనివి - పంచాయతీరాజ్ డిఈ నాగేందర్
- విద్యానగర్ రోడ్డుకు ఇరుపక్కల ఉన్న డ్రైనేజీలను ఆక్రమిస్తున్న చిరు వ్యాపారులు
- విద్యానగర్ పంచాయతీలోని వంద అడుగుల బైపాస్ రోడ్డుని ఆక్రమించి షాపులు నిర్మాణం చేస్తున్న ప్రభుత్వ అధికారుల బంధువులు
- ఎవరి వాటా వారికి చేరుతుంటే అధికారులకు ఆక్రమణలు ఎందుకు కనిపిస్తాయి - సామాన్య ప్రజలు








**భద్రాద్రి కొత్తగూడెం, 28 అక్టోబర్ చర్చ బ్యూరో**

భద్రాద్రి కొత్తగూడెం నియోజకవర్గ మండలం అయినటువంటి చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ పంచాయతీ పరిధిలోని రోడ్లు, డ్రైనేజీలు ఆక్రమణకు గురవుతున్నాయి. రోడ్లకు ఇరు ప్రక్కల ఉన్నటువంటి ఫూట్ పాత్ లను కూరగాయలు విక్రయించేవారికి కేటాయించిన మున్సిపాలిటీలు, పంచాయతీలు వారి వద్ద నుండి పన్నులు వసూలు చేసుకుంటున్నారు. డ్రైనేజీలను ఆక్రమించి షాపులు నిర్మాణం చేసిన వారు ఎటువంటి పరిమిషన్స్ లేకుండా ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో ఆక్రమణలు చేస్తున్నారు. విద్యానగర్లో రోడ్డుకు ఇరు ప్రక్కల నిర్మించిన డ్రైనేజీల గురించి పంచాయతీ రాజ్ డిఈ నాగేందర్ ని వివరణ కోరగా, డ్రైనేజీలను నిర్మించి ఇవ్వడం వరకే మా పరిధి. వాటిని నిర్మించి ఇచ్చాం. డ్రైనేజీలపై నిర్మించిన షాపులు విద్యానగర్ పంచాయతీ ఈవో పరిధిలోనికి వస్తాయని తెలిపారు. విద్యానగర్ పంచాయతీ ఈవో అందుబాటులో లేని కారణంగా, చుంచుపల్లి మండల ఎంపీ ఓ నీ, డ్రైనేజీలపై అక్రమంగా నిర్మించిన షాపుల గురించి, ఫుట్ పాత్ లను ఆక్రమించి నిర్మించిన షాపుల గురించి, విద్యానగర్ పంచాయతీ పరిధిలో గల బైపాస్ లోని వంద అడుగుల రోడ్డుని ఆక్రమించి నిర్మించిన కర్రల షాపు, పాన్ షాప్, టీ, టిఫిన్ షాపుల గురించి వివరణ కోరగా, విద్యానగర్ పంచాయతీ పరిధిలోనికి వస్తాయని తెలిపారు. చుంచుపల్లి పంచాయితీకి ఈవోగా, చుంచుపల్లి మండలానికి ఎంపీ ఓ గా విధులు నిర్వహిస్తున్నప్పటికీ విద్యానగర్ పంచాయతీ నా పరిధి కాదు అని చెప్పడం కొంత ఆశ్చర్యానికి గురి చేసింది. బైపాస్ లోని డ్రైనేజీలను ఆక్రమించి షాపులు నిర్మాణం చేసినవారు ప్రజా ప్రతినిధుల మనుషులైతే, బైపాస్ లో గల 100 అడుగుల రోడ్డులో పర్మిషన్ లేకుండా కర్రల షాపు పెట్టిన వారు పోలీస్ కానిస్టేబుల్ సోదరుడు. షాపుల నిర్మాణాలు చేయడం, వాడుక మురికి నీటిని రోడ్లపైకి వదలడం, వాహనాలను నిలిపి ట్రాఫిక్ కి ఇబ్బంది కలిగించడం వంటివి రోజు ఫీల్డ్ విజిట్ చేసే అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలిసినప్పటికీ ఎవరి వాటా వారికి చేరడం వల్లే మౌనంగా ఉంటున్నారని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.

## రైతు సంక్షేమానికి కృషి విజ్ఞాన కేంద్రాల పాత్ర కీలకం - జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం, 28 అక్టోబర్ చర్చ బ్యూరో** రైతు సంక్షేమానికి కృషి విజ్ఞాన కేంద్రాల పాత్ర కీలకం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం లోని కృషి విజ్ఞాన కేంద్రం (%ఖఎఖ%) ను సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ఆయన కేంద్రంలో చేపడుతున్న నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, భూసార పరీక్షా కేంద్రం కార్యకలాపాలు, సమగ్ర వ్యవసాయ నమూనా యూనిట్లను సమీక్షించారు. కేంద్రంలోని పరిశోధన, శిక్షణా కార్యక్రమాలు, రైతు అవగాహన కార్యక్రమాలపై శాస్త్రవేత్తలతో చర్చించి, రైతు సంక్షేమానికి కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి. భరత్ జిల్లా వ్యాప్తంగా రైతులకు అందిస్తున్న సాంకేతిక మార్గదర్శకత, పంటల విస్తరణ కార్యక్రమాలు, వివిధ ప్రభుత్వ పథకాల అనుసంధానం, మరియు శిక్షణా కార్యక్రమాలపై కలెక్టర్ కి సమగ్రంగా వివరించారు. అనంతరం గిరిజన ఉపాధి పథకం (%ఠతీఱఅఝశ్రీ ాబఎ ్రాశ్రీఖఅ%) కింద కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇల్లందు మండలంలోని పోపెల్లి గ్రామానికి చెందిన రైతులతో ముచ్చటించి, పట్టుపురుగుల పెంపకం, విప్పపువ్వు సాగు, సమగ్ర వ్యవసాయం పద్ధతులు వంటి ఆధునిక వ్యవసాయ విధానాలపై వారికి అవగాహన కల్పించారు. రైతులు ఆధునిక పద్ధతులను అవలంబిస్తే పంటల దిగుబడి పెరుగుతుందని, ఆదాయం కూడా పెరుగుతుందని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..కృషి విజ్ఞాన కేంద్రాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. రైతులకు శాస్త్రీయ అవగాహన, సాంకేతిక సహాయం, మరియు సమగ్ర వ్యవసాయ పద్ధతుల ప్రచారం ద్వారా రైతు ఆదాయాన్ని పెంచడంలో ఈ కేంద్రాల పాత్ర అత్యంత ప్రాముఖ్యమైనది అని పేర్కొన్నారు. తరువాత కలెక్టర్ కృషి విజ్ఞాన కేంద్రంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికలు, విత్తనోత్పత్తి క్షేత్రాలు, మరియు రైతు మద్దతు సేవలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన భూసార పరిశీలన సదుపాయాలు విస్తరించాలి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంట రకాలను అభివృద్ధి చేయాలి, మరియు రైతులకు సాంకేతికత చేరే విధంగా డిజిటల్ అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ చేతులమీదుగా గిరిజన రైతులకు తార్పాలిన్లు మరియు వ్యవసాయ ఉపయోగ సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమం లో శాస్త్రవేతలు డాక్టర్. హేమ శరత్ చంద్ర మరియు బి. శివ, రైతులు సంబధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'చర్చ' ఎఫెక్ట్
## సాఫీగా సదరమ్ క్యాంపు

- బెంచీలు, ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యాల కల్పన
- ఫోన్‌లో రీల్స్ చూస్తూ టైంపాస్ చేసిన 'డాక్టర్'




చర్చ
తెలుగు దిన పత్రిక

### సదరమ్ క్యాంపులో సౌకర్యాల లేమి

- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న దివ్యాంగులు
- తిరగని ఫ్యాన్లు... కూర్చునేందుకు కుర్చీలు కరువు
- సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన దివ్యాంగుల బంధువులు











**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడిన సదరమ్ క్యాంప్ ఈ దఫా సాఫీగా సాగింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం నిర్వహించిన సదరమ్ క్యాంపునకు వివిధ దూర ప్రాంతాల నుంచి రోగులు హాజర య్యారు. వీరికి అవసరమైన బెంచీలు, ఫ్యాన్లు, తాగునీటి వసతిని ఆస్పత్రి అధికారులు కల్పించారు. ఈనెల 7వ తేదీన నిర్వహి ంచిన సదరమ్ క్యాంప్ నందు అసౌకర్యాలను వెలుగులోకి తీసుకు వస్తూ 'చర్చ' దినపత్రికలో 'సదరమ్ క్యాంపులో సౌకర్యాల లేమి' శీర్షికతో 8వ తేదీన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లాలోని భద్రాచలం, మణుగూరు, ఇల్లందు, జూలూరుపాడు, ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు వంటి ప్రాంతాల నుంచి సుమారు 200 మందికి పైగా దరఖాస్తుదారులు సదరమ్ క్యాంపునకు హాజరయ్యారు. నాడు బెంచీలు లేక నేలపై కూర్చున్న రోగులు ఈసారి బెంచీలు ఏర్పాటు చేయడంతో వాటిల్లో కూర్చున్నారు. అంతేకాక వెయిటింగ్ హాల్స్‌లో, కారిడార్‌లోనూ ఫ్యాన్లు, వచ్చినవారు తాగేందుకు మంచినీటి సౌకర్యాలు కల్పించారు. గతంలో సదరమ్‌కు వచ్చి ఇబ్బందులు పడినవారు ఈసారి సౌకర్యాల కల్పనను చూసి 'చర్చ' పత్రికను అభినందించారు. ఇదిలా ఉండగా క్యాంపునకు వచ్చిన వారిని పరీక్షించేందుకు డాక్టర్లకు ఏర్పాటు చేసిన గది మరీ చిన్నదిగా ఉండటంతో రోగులు కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది. నలుగురు డాక్టర్లకు కలిపి ఒకే గది, మళ్లీ అదే గదిలో ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లను కూడా ఏర్పాటు చేయడంతో రోగులు గదిలో తిరుగుటకు వెసులుబాటు లేకుండా పోయిందని వాపోతున్నారు. ఓపెన్ ప్లేస్ లేదా హాల్ వంటి వాటిల్లో క్యాంపు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**రీల్స్ చూస్తూ టైంపాస్ చేసిన డాక్టర్?**

ఒకవైపు సదరమ్ క్యాంపునకు వచ్చి బయట పదుల సంఖ్యలో రోగులు, వారి బంధువులు డాక్టర్ పిలుపు కోసం వేచి చూస్తుండగా, డాక్టర్ల గదిలో మాత్రం ఒక డాక్టర్ మొబైల్ ఫోన్‌లో రీల్స్ చూస్తూ టైంపాస్ చేస్తూ కన్పించారు. మిగతా డాక్టర్లు తమపని తాము చేసుకుంటుండగా ఈ డాక్టర్ మాత్రం మొబైల్‌ఫోన్‌లో మునిగిపోవడంపట్ల రోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎంతో కష్టపడి దూర ప్రాంతాల నుంచి సదరమ్ పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వస్తే ఇలా వైద్యులు టైంపాస్ చేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. సిన్సియర్‌గా విధులు నిర్వర్తించే వారిని మాత్రమే సదరమ్ క్యాంపులో రోగులను పరీక్షించేందుకు నియమించాలని, తద్వారా రోగులు ఎక్కువ సమయం డాక్టర్ పిలుపు కోసం వేచి చూసే పరిస్థితి ఉండదని అంటున్నారు.

**లేటెస్ట్ స్కానింగ్ రిపోర్ట్ లేదన్నారు: కొంటు సాంబయ్య, ఏన్కూరు**

నేను నా తల్లిని సదరమ్ క్యాంపునకు తీసుకుని వచ్చాను. తనకు గతంలో సిటి స్కాన్ వంటివి చేపించాము. కాని క్యాంపునకు వచ్చాక లేటెస్ట్ స్కాన్ రిపోర్టులు కావాలన్నారు. మళ్లీ సిటి స్కాన్‌కు రిఫర్ చేశారు. అయితే క్యాంపునకు రావాలని ఫోన్ చేసే సమయంలోనే ఏయే రిపోర్టులు తీసుకురావాలనే విషయాలను తెలియజేస్తే తాము ముందుగానే సిద్ధం చేసుకుని వస్తాము. నడవలేని స్థితిలో ఉన్న నా తల్లిని ఇలా ఆస్పత్రి చుట్టూ తిప్పాలంటే కష్టంగా ఉంది.

## అర్బన్ బ్యాంక్ భవిష్యత్ వెలిచాల ప్యానెల్ గెలుపుపైనే

- ప్యానెల్ కు పెరుగుతున్న అనూహ్య మద్దతు
- అర్బన్ బ్యాంకు మెంబర్లలో మంచి ఆదరణ
- వినూత్న రీతిలో వెలిచాల ప్యానల్ ప్రచార పర్వం ఆలోచన రేకెత్తించేలా ముందుకు
- తాజాగా మద్దతు ప్రకటించిన నామినేషన్ వేసిన ఇద్దరు లిఅభ్యర్థులు. సీనియర్ కాంగ్రెస్ నేత
- వెలిచాల రాజేందర్ రావు
- సమక్షంలో సంఘీభావం
- స్వచ్ఛందంగా ముందుకొస్తున్న నేతలు





**కరీంనగర్..** కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఆధ్వర్యంలో అర్బన్ బ్యాంక్ ఎన్నికల బరిలోకి దిగిన నిర్మల భరోసా ప్యానల్ కు రోజురోజుకు అనూహ్యంగా మద్దతు పెరుగుతున్నది. ప్రచారపర్వం వినూత్న రీతిలో కొనసాగుతున్నది. తమ ప్యానెల్ ను ఎందుకు గెలిపించాల్సిన అవసరం ఉందో అర్బన్ బ్యాంక్ మెంబర్లకు ఆకట్టుకునే రీతిలో అవగాహన కల్పిస్తున్నారు రాజేందర్ రావు. దీంతో సీనియర్ నేతలు.. పోటీలో ఉన్నవారు..అర్బన్ బ్యాంక్ మెంబర్లు ఆలోచనలో పడుతున్నారు. ఈ నేపథ్యంలో నిర్మల భరోసా ప్యానల్ కు సంఘీభావం ప్రకటిస్తున్నారు. తాజాగా మంగళవారం నామినేషన్లు వేసి బరిలో నిలిచిన ఇద్దరు రాజేందర్ రావు ప్యానల్ కు మద్దతు ప్రకటించారు. ధరణికోట దామోదర్, యాగండ్ల రవి ఇటీవల అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ వేశారు. ధరణికోట దామోదర్, యాగండ్ల రవి ముందుకొచ్చి వెలిచాల రాజేందర్ సమక్షంలో నిర్మల భరోసా ప్యానల్ కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వీరితోపాటు సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్లో పని చేస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దిండిగాల మధు తన సంపూర్ణ మద్దతును వెలిచాల రాజేందర్ రావు ప్యానల్ కు ప్రకటించారు. రాజేందర్ రావ్ ఆధ్వర్యంలో అర్బన్ బ్యాంకు అభివృద్ధి చెందుతుందనీ, అభ్యర్థుల వ్యక్తిత్వం గుణగణాలు చూసి మద్దతు ప్రకటించామని ధరణికోట దామోదర్ యాగండ్ల రవి, దిండిగాల మధు పేర్కొన్నారు. రాజేందర్ రావ్ బలపరుస్తున్న ప్యానెల్ కచ్చితంగా గెలిచి తీరుతుందని రాజేందర్ రావు ఆధ్వర్యంలో అర్బన్ బ్యాంకుకు మహర్దశ వస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. వీరితోపాటు బీర్పూర్ నాగేశ్వరరావు చిలుక హనుమంత రెడ్డి పాల్గొన్నారు. నామినేషన్ వేసిన ఇద్దరు అభ్యర్థులపాటు సీనియర్ కాంగ్రెస్ నేత తమ ప్యానెల్ కు మద్దతు ప్రకటించడం పట్ల రాజేందర్ రావు హర్షం వ్యక్తం చేశారు. తమ ప్యానెల్ గెలుపు దాదాపు ఖాయమైందని సీనియర్ నేతలు.. పోటీలో ఉన్నవారు..అర్బన్ బ్యాంకు మెంబర్ల నుంచి తమకు రోజురోజుకు మద్దతు పెరుగుతున్నదనీ, సపోర్ట్ గా ముందుకు వస్తున్న వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. తమ ప్యానెల్ గెలుపు అర్బన్ బ్యాంకు మలుపుకు సంకేతమని రాజేందర్ రావు తెలిపారు. తమ ప్యానెల్ గెలుపు పైనే అర్బన్ బ్యాంక్ భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు.

# నియోజకవర్గ వ్యాప్తంగా మంత్రి పొంగులేటి పుట్టినరోజు వేడుకలు







**చర్చ, అశ్వారావుపేట:** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గంలోని 5 మండలాల్లో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గండుగులపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ముందుగా కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను జరిపారు. అనంతరం చంద్రుగొండ మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. సీతాయిగూడెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలం కేంద్రంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కాంగ్రెస్ నాయకులు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ములకలపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు కార్యకర్తల సమక్షంలో వేడుకలు నిర్వహించగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అశ్వారావుపేట ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో ఘనంగా నిర్వహించిన తరువాత ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు.

# ప్రతి విద్యార్థికి చదువుతోనే భవిష్యత్తు

**- జూనియర్ కళాశాలల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి**
**- అడ్మిషన్లు ,ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు అవసరం**
**- జిల్లాలో జూనియర్ కళాశాలల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష**


**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని, ఈ విషయాన్ని గ్రామస్థాయిలో విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలియజేసే బాధ్యత అధ్యాపకులపై ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మహిళా సమాఖ్య సభ్యులు, సీసీ కోఆర్డినేటర్లు, ఏటీఎంలు, మహిళా సంఘాల సభ్యులు ద్వారా "చదువుతోనే భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుంది" అనే సందేశాన్ని ప్రతి విద్యార్థికి చేరేలా చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో జూనియర్ కళాశాలల అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై, కళాశాలల్లో చేరికలు, ఉత్తీర్ణత శాతం, అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రిన్సిపాల్స్, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశం మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించగా, తరగతి గదులు, లీకేజీ నివారణ, విద్యుదీకరణ, త్రాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి కళాశాల ప్రిన్సిపాల్ నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తూ పనులను పర్యవేక్షించాలన్నారు. విద్యుదీకరణ పనులు అన్ని డిజిటల్ తరగతుల నిర్వహణకు అనుగుణంగా చేయాలని సూచించారు. కళాశాలల్లో అడ్మిషన్లు పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా అశ్వారావుపేట, చర్ల, పినపాక, దుమ్ముగూడెం కళాశాలల్లో చేరికలు తగ్గడానికి గల కారణాలను ప్రిన్సిపాల్‌లను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల నాణ్యత, ఉచిత విద్యా వాతావరణం గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని





అధికారులను ఆదేశించారు. కళాశాలల ప్రిన్సిపాల్‌లు విద్యార్థుల హాజరు, బోధనా ప్రమాణాలు, పరీక్షా ఫలితాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌లు కళాశాలలకు బస్సు సౌకర్యం కల్పిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని సూచించగా, కలెక్టర్ బస్సు సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ఆధారంగా కళాశాలలకు ర్యాంకులు ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి కళాశాల ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలించి, తక్కువ ఫలితాలు నమోదైన కళాశాలల కారణాలను విశ్లేషించారు. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అన్ని జూనియర్ కళాశాలలో 15 రోజుల్లోగా యూడీసీ పోర్టల్, ఎఫ్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలను పూర్తి చేయాలని, విద్యార్థుల ఆధార్ సవరణలు, నవీకరణల కోసం కళాశాలలో ఆధార్ క్యాంపులు నిర్వహించాలనీ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇంజనీరింగ్ శాఖ సిబ్బంది, విద్యాశాఖ కోఆర్డినేటర్ సతీష్, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గాజులరామారం సర్కిల్ లో జోరుగా అక్రమ నిర్మాణాలు


**- అక్రమనిర్మాణాలపై నో యాక్షన్**
**- అందినకాడికి దండుకుంటున్న టౌన్ ప్లానింగ్ అధికారులు**






**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 28(చర్చ):** గ్రేటర్ హైదరాబాద్ కూకట్పల్లి జోన్ గాజులరామారం సర్కిల్ లో అంతులేని అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. గల్లీకో అనుమతుల్లేని భవన నిర్మాణాలు కండ్లకు కట్టినట్టు కనిపిస్తున్నా.. వాటిని నివారించడంలో విఫలమతున్నారు ఇక్కడి టౌన్ ప్లానింగ్ అధికారులు. ఎలాంటి అనుమతులు లేకుండా కొన్ని వందల సంఖ్యలో బహుళ అంతస్థుల నిర్మాణాలు వెలుస్తున్నా అందినకాడికి దండుకుంటూ తమ విధులను మర్చిపోతున్నారు. మరీ ఫిర్యాదులు వస్తే తప్ప నోటీసులు జారీ చేయడం లేదు. ఒకవేళ నోటీసులు జారీ చేసినా... అక్రమ వసూళ్లతో ఇక్కడి అక్రమ నిర్మాణాలను నివారించలేకపోతున్నారు కొందరు అవినీతి అధికారులు. గాజులరామారంలో టౌన్ ప్లానింగ్ రాజ్యమేలుతున్నా తమకు ఎలాంటి సంబంధం లేదన్నట్టు వ్యవహారిస్తున్నారు ఇక్కడి నోడల్ అధికారి. అక్రమ నిర్మాణాలను నివారించడానికి స్పెషల్ టాస్క్ ఫోర్స్ అండ్ డెమోలిషన్ స్క్వాడ్ ఏర్పాటు చేసినా లాభం లేకుండా పోయింది. అందుకు ప్రత్యక్ష నిదర్శనం... గాజులరామారం వార్డు రాంకీ మార్వెల్ ముందు కేవలం గ్రౌండ్ ప్లస్ రెండు ఫ్లోర్ల నిర్మాణానికి అనుమతులు పొందిన నిర్మాణదారుడు అయిదు అంతస్థుల కమర్శియల్ భవన నిర్మాణం పూర్తి చేశాడు. సదరు నిర్మాణం పై ఎన్నో ఫిర్యాదులు టౌన్ ప్లానింగ్ అధికారులకు అందినా కనీసం చీమ కుట్టినట్టు కూడా లేదంటే... ఎంతలా దండుకున్నారో ఇట్టే అర్థమవుతుంది. అంతేకాకుండా కైసర్ నగర్ చౌరస్తా పక్కనే నివాసాలా మధ్య భారీ కమర్శియల్ షెడ్డు ఏర్పాటు చేస్తున్నా... సదరు నిర్మాణం పై ఎలాంటి చర్యలు లేవు. ఇదిలాగే కొనసాగితే అసలు టౌన్ ప్లానింగ్ అనే శాఖనే మర్చిపోతారు నిర్మాణదారులు.

**షిరిడీ హిల్స్ లో..**

గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట షిరిడీ హిల్స్ లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్థుల భారీ నిర్మాణంపై ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు స్థానిక ప్రజలు. గాజులరామారం టౌన్ ప్లానింగ్ అధికారులు ఇకనైనా స్పందించి సర్కిల్ పరిధిలో వెలుస్తున్న బహుళ అంతస్థుల అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# సాయంత్రం 5 తర్వాత అన్నీ క్లోజ్: మంత్రి అచ్చెన్నాయుడు



**కోనసీమ, అక్టోబర్ 28:** ప్రకృతి వైపరీత్యాలను ఆపడం మన చేతిల్లో లేదని. కానీ ప్రజల ప్రాణాలు, ఆస్తి నష్టం జరగకుండా చూసుకోవడం మాత్రం ప్రభుత్వ బాధ్యతని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడుతూ. తుపాను పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ... పోలీసు, రెవెన్యూ శాఖలతో అనుసంధానమై పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. తీవ్ర ప్రభావిత ప్రాంతాల్లో రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామని.. సాయంత్రం ఐదు గంటల తర్వాత రోడ్లన్నీ బ్లాక్ చేస్తామని ప్రకటించారు. భవనాలు కలిగిన వారు పేద కుటుంబాలకు తాత్కాలిక ఆశ్రయం కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారని చెప్పారు. విద్యుత్ స్తంభాలు, లైన్లు పునరుద్ధరించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మంత్రి తెలిపారు.ఎక్కడైనా చెట్లు కూలినా, రహదారులు మూసుకుపోయినా ఎన్డీఆర్ఎఫ్ దళాలు తక్షణమే చర్యలు తీసుకుంటాయని అన్నారు. నర్సాపురం, రాజోలులో తుపాను తీరం తాకే అవకాశం ఉన్న నేపథ్యంలో సాయంత్రం 5 గంటల తర్వాత ప్రజలంతా ఇండ్లకు చేరుకోవాలని సూచించారు. తుపాను సమయంలో ఎవరూ బయటకు రాకూడదని హెచ్చరించారు. ఆహారం, పాలు, త్రాగునీరు అన్ని పునరావాస కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని మంత్రి తెలిపారు. రైతాంగం, ఆక్వా రంగం ఆందోళన చెందవద్దని... నష్టపరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. 'ఇది ఒక విపత్తు.. కానీ మనం కలిసికట్టుగా ఎదుర్కోవాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# దూస్తుకొస్తున్న మొంథా తుపాను అధికారులు అలర్ట్



**అమరావతి, అక్టోబరు 28:** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మొంథా తీవ్ర తుపాను గా మారిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. గడిచిన 6 గంటల్లో గంటకు 10 కిలోమీటర్ల వేగంతో తుపాను కదిలిందని వెల్లడించారు. ప్రస్తుతానికి మచిలీపట్నాని 110 కిలోమీటర్లు, కాకినాడ కి 190 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 280 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమైందని వివరించారు. ఈ మేరకు ప్రఖర్ జైన్ ఓ ప్రకటన విడుదల చేశారు.(మంగళవారం) రాత్రికి కాకినాడ – మచిలీపట్నం మధ్య తీవ్ర తుపానుగా తీరం దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. తుపాను ఏపీ తీరానికి దగ్గరకు వచ్చే కొద్దీ తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. తుపాను ప్రభావంతో కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వివరించారు. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించారు. కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని సూచించారు ప్రఖర్ జైన్.తుపాను నేపథ్యంలో రహదారులపై ఆంక్షలుతుపాను ప్రభావిత జిల్లాల్లో భారీ వర్షాల నేపథ్యంలో రహదారులపై అధికారులు ఆంక్షలు విధించారు. జాతీయ రహదారుల్లో ప్రయాణించే భారీ వాహనాలను ఇవాళ రాత్రి 7 గంటల నుంచి నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. తుపాను ప్రభావిత జిల్లాల కంటే ముందుగానే ఏదైనా సురక్షిత ప్రాంతంలో వాహనాలు నిలిపివేయాలని వాహనదారులకి సూచించారు. తుపాను నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయొద్దని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ కోరారు.

# కాంగ్రెస్ నేతలకు షర్మిల పిలుపు



**ఎన్టీఆర్:** మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని చీఫ్ వైఎస్ షర్మిల తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేసే కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా మన వంతు సహాయక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజలను పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలించే విషయంలో నాయకులు ముందు నిలవాలన్నారు. ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు అందరూ.. ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలవాలని షర్మిల విజ్ఞప్తి చేశారు.మొంథా తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో.. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తుండటంతో.. జనజీవనం అస్తవ్యస్తం అవుతుంది. రహదారులపై నీరు చేరడంతో.. చెరువులను తలపిస్తున్నాయి. పలు కాలనీలకు వరద నీరుతో జలదిగ్బంధం అయ్యాయి. మరోవైపు తుఫాను ప్రభావం ఉన్న ప్రాంతాల ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.

# గంటకు 12 కి.మీ వేగంతో దూసుకొస్తున్న మొంథా



**అమరావతి, అక్టోబర్ 28:** మొంథా తుపాను ఆంధ్రా వైపుకు ఎంతో వేగంగా దూసుకొస్తోంది. తుపాను నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేసేందుకు అధికారులు అంతా సిద్ధం చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మొంథా తీవ్ర తుపానుగా బలపడింది. గడిచిన 6 గంటల్లో గంటకు 12 కి.మీ వేగంతో తుపాను కదిలింది. ప్రస్తుతానికి మచిలీపట్నానికి 160 కి.మీ, కాకినాడకు 240 కి.మీ, విశాఖపట్నానికి 320 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది.(మంగళవారం) రాత్రికి కాకినాడ– మచిలీపట్నం మధ్య తీవ్ర తుపానుగా తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 90–110 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. తుపాను ప్రభావంతో నేడు శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు అతిభారీ వర్షాలు కురవనున్నాయని తెలిపారు. కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచనలు చేశారు.

# ఎల్ఐసి ఉనికికే ప్రమాదం !

ఆదానీతో మోడీ బంధం ఎంతో బలమైనది. అది ఫెవికాల్ లాంటిది. దానిని విడదీయడం అంత సులువు కాదు. గత పదేళ్లుగా ఇది రుజువైన విషయం. ఆదానీ కంపెనీపై వరుసగా విమర్శలు వస్తున్నా ..ఏనాడూ చర్యలు తీసుకోలేదు. సరికదా ఖండించడానికి కూడా ప్రధాని మోడీ పెదవి విప్పలేదు. ఆదానీ వ్యవహారంపై గతంలో పార్లమెంట్ స్తంభించింది. ఆదానీ గ్రూపు ఆర్థిక అవతవకలు, అమెరికా సంస్థ ఆరోపణలు అలా ఉండగానే తాజాగా ఆ కంపెనీకి ఎల్ఐసి మొత్తాన్ని ధారపోసారు.గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడిచింది. ప్రతిష్టాత్మక ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత జీవిత బీమా సంస్థ ఎల్ఐసిని అదానీ ప్రయోజ నాల కోసం కేంద్ర ప్రభుత్వం బలి పెట్టడంపై వస్తున్న విమర్శలను సైతం పట్టించుకోవడం లేదు. అంటే ప్రధాని మోడీ తన ప్రధాని పదవిని అడ్డం పెట్టి ఆదానీకి అండగా నిలబడ్డారని వేరుగా చెప్పనక్కరలేదు. కోట్లాదిమంది పాలసీదారుల, ఉద్యోగుల, అధికారుల ప్రయోజనాలను అదానీ వ్యాపార కాంక్షకు సమిధలు చేయడం అమానుషం. నిజానికి గతంలోనే ఎల్ఐసిని ప్రైవేటీకరించాలని చూశారు. దీనిపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వచ్చాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సైతం ప్రైవేటీకరణకు రంగం సిద్ధం చేశారు. కానీ బిజెపికి పూర్తి మెజార్టీ రాకపోవడం, ఎపిలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడడంతో ఆగిపోయింది. ఎల్ఐసిని ప్రైవేటీకరిస్తే ఆదానికి అప్పగించేవారేమో అన్న అనుమానాలు ఇప్పుడు కలుగుతున్నాయి. దేశీయంగా ఉన్న కంపెనీలను ఇలా తన తాబేదార్లకు కట్టబెట్టే కుట్ర లోపాయకారిగా జరుగుతున్నదని ప్రజలు గుర్తించాలి. ఎల్ఐసి మొత్తాలను ఆదానికి అప్పుగా బదిలీ



చేయడంపై దేశంలో అప్పుడే నిరసనలు మొదలయ్యాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలుగు రాష్ట్రాల్లో లెఫ్ట్ నేతలు కూనంనేని సాంబశివరావు, బివి రాఘవులు వంటివారు, మరికొందరు నిరసనల గళం విప్పారు. బీహార్ ఎన్నికల సందడిలో ఇదంతా గుట్టు చప్పుడు కాకుండా సాగిపోతోంది. సామాన్యుల చెమట చుక్కలే పెట్టుబడిగా ఎదిగిన ఎల్ఐసికి చెందిన వేల కోట్ల రూపాయల మొత్తాన్ని అదానీ గ్రూపునకు గుట్టుచప్పుడు కాకుండా మళ్లించేందుకు అత్యున్నత స్థాయిలో కుట్ర జరిగిందన్నది చెప్పకనే చెప్పవచ్చు. అమెరికా నుండి వెలువడే 'వాషింగ్టన్ పోస్ట్' పత్రికలో ఈ కథనం తొలుత రావడం గమనార్హం. అంతర్జాతీయంగా విత్తసంస్థలు అదానీకి అప్పులు ఇవ్వడానికి నిరాకరిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం 3.9 మిలియన్ డాలర్లు అంటే 33 వేల కోట్ల రూపాయలను అదానీ గ్రూపునకు మళ్లించడానికి సిద్ధమైందని వార్తలు వచ్చాయి. ఇందులో భాగంగానే అదానీ పోర్ట్స్ అనుబంధ సంస్థ రుణాల రీఫైనాన్స్ కోసం జారీ చేసిన 585 బిలియన్ డాలర్ల దాదాపు రూ.5,000 కోట్లు బాండ్లను ఎల్ఐసి కొనుగోలు చేసింది. 'అదానీపై లంచం, మోసం ఆరోపణలపై అమెరికా కోర్టుల్లో కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అనేక అమెరికా, యూరోపియన్ బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనుకాడాయి. కానీ.. భారత ప్రభుత్వం మాత్రం అదానీ కోసం ప్రత్యేక ఆర్థిక మద్దతు ప్రణాళికను రూపొందించిందని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్), ఎల్ఐసి నుండి పొందిన అంతర్గత పత్రాలు సహా అధికారులు, బ్యాంకర్లతో ఇంటర్వ్యూల ఆధారంగా ప్రభుత్వం ఈ నిధుల మళ్లింపునకు ఏ విధంగా పాల్పడిందో గుర్తించామని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొందంటే పథకం ఎంత పకడ్బందీగా రూపొందించారో తేటతెల్లమవుతుంది. ఆదానీ పోర్ట్సు అప్పటికే తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించడం కోసం బాండ్లను జారీ చేయాలని నిర్ణయించుకున్న సమయంలోనే ఉన్నత స్థాయిలో ఎల్ఐసి నిధుల తరలింపునకు సంబంధించిన ప్రణాళిక సిద్ధమైందని అర్థం అవుతోంది. మే 30వ తేదీన అదానీ పోర్ట్సు విడుదల చేసిన మొత్తం బాండ్లను ఎల్ఐసి కొనేసింది. అదానీ గ్రూపు షేర్లు, బాండ్లు కొనడానికి విదేశీ విత్త సంస్థలేవీ సిద్ధం కాని నేపథ్యంలో భారత ప్రభుత్వరంగ బీమా సంస్థచేత కొనిపించి, అదానీ గ్రూపునకు విశ్వసనీయత కల్పించాలన్నదే ఆ పథకంలో భాగంగా అర్థం చేసుకోవచ్చు. ఆ పాచిక పారింది కనుకనే అంతకు ముందు వెనక్కి తగ్గిన అమెరికా సంస్థ ఏథెన్ ఇన్సూరెన్స్ జూన్‌లో 750 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.6,650 కోట్లు పెట్టుబడులు పెట్టింది. ఆదానీ ఆర్థిక అక్రమాలు, అవినీతిపై 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వరుస రిపోర్టులను విడుదల చేసింది. అదానీ కృత్రిమంగా తన కంపెనీల షేర్లను పెంచుకుంటున్నారని.. డొల్ల కంపెనీలతో పన్నులు ఎగ్గొడుతున్నారని విశ్లేషించింది. అదానీ కంపెనీలు ప్రమాదకర అప్పుల్లో ఉన్నాయని కూడా వెల్లడించిన విషయం తెలిసిందే. దీనికి తోడు తాజాగా వాషింగ్టన్ పోస్ట్ రిపోర్ట్ ఇటు ప్రభుత్వ వర్గాల్లోనూ, అటు ఇన్వెస్టర్లు, కార్పొరేట్ వర్గాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. అయితే అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి తమపై ఎవరి ఒత్తిళ్లు లేవని ఎల్ఐసి పేర్కొంది. బోర్డు ఆమోదించిన విధి విధానాల మేరకే తాము పెట్టుబడులు పెడతామని, వాటిపై తమదే తుది నిర్ణయమని బుకాయించింది. అందువల్ల ఎల్ఐసిలో ఏం జరుగుతుందో దేశ ప్రజలకు తెలపడం ప్రభుత్వ బాధ్యత. ఈ వ్యవహారంపై పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించడం అవసరమన్న డిమాండ్‌ను కూడా ఆమోదిం చాలి. ఇంతపెద్ద మొత్తంలో వ్యవహారం గుంభనంగా సాగడాన్ని అడ్డుకోవాలి. ఎల్ఐసిని మరోమారు ప్రైవేట్ రంగానికి అప్పగించే కుట్రలో కూడా ఇదో భగంగా చూడాలి. అందుకోసం ప్రభుత్వంపై ప్రజల ఒత్తిడి పెరచాలి. పాలకుల కార్పొరేట్ అనుకూల నిర్ణయాలపై నిలదీయాలి. లేకుంటే ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్ కావడం ఖాయం. దీనిపై విపక్ష కాంగ్రెస్ గట్టిగా నిలబడాలి.


# అంతర్జాతీయంగా ట్రేడ్ మార్పులు

- పెరిగిన బంగారం ధరల్లో తగ్గుదల
- మరింతగా తగ్గుతుందన్న అంచనాలు



**హైదరాబాద్,అక్టోబర్28:** దీపావళి సమయంలో ఉవ్వెత్తున ఎగసిన పసిడి ధర దిగొచ్చింది. అంతర్జాతీయ పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాలతో దిద్దుబాటుకు గురైంది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4 వేల డాలర్ల స్థాయి దిగువకు చేరింది. అమెరికా- చైనా మధ్య త్వరలో ట్రేడ్ డీల్ కుదరొచ్చన్న అంచనాలు ఈ కరెక్షన్‌కు కారణమని నిపుణులు చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య అక్టోబర్ 30న జరిగే భేటీలో ఆ మేర కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉందన్న అంచనాలతో పుత్తడికి డిమాండ్ తగ్గినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో ఇటీవలి వరకూ చుక్కలనంటిన పసిడి ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. మంగళవారం కూడా పసిడి, వెండి ధరల్లో తగ్గుదల కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ప్రస్తుతం దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర నిన్నటితో పోలిస్తే రూ. 820 మేర తగ్గి రూ.1,22,460కు చేరుకుంది. ఇక ఆర్నమెంటల్ బంగారం ధర రూ.750 మేర తగ్గి 1,12,250కు చేరుకుంది. వెండి ధరల్లో కూడా భారీ కోత పడింది. కిలో వెండి ధర సుమారు రూ.4 వేల మేర తగ్గి రూ.1,51,000కు చేరుకుంది. ఇక హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర రూ.1,22,460గా ఉంది. ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,12,250గా ఉంది. కిలో వెండి ధర మాత్రం రూ.1.65 లక్షలుగా ఉంది. ఇక అంతర్జాతీయ మార్కెట్ లోనూ పసిడి ధరల్లో భారీ తగ్గుదల కనిపిస్తోంది. ఔన్స్ 24 క్యారెట్ బంగారం 3986 డాలర్ల వద్ద కొనసాగుతోంది. నిన్నటితో పోలిస్తే సుమారు 3 శాతం మేర ధరల్లో కోత పడింది. మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్‌లో గోల్డ్ డిసెంబర్ ఫ్యూచర్స్ ధర కూడా 2.35 శాతం మేర తగ్గి రూ.1,20,546 వద్ద కొనసాగుతోంది. మలేషియా వేదికగా అమెరికా, చైనా ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు సానుకూల ఫలితాలను ఇచ్చాయి. ఎగుమతుల పై నియంత్రణలు, డ్రగ్స్ కట్టడి, షిప్పింగ్ లెవీల వంటి వాటిపై ఇరు దేశాల మధ్య ప్రాథమిక స్థాయిలో ఏకాభిప్రాయం కుదరడంతో బంగారానికి డిమాండ్ తగ్గింది. టిక్‌టాక్ విక్రయంపై భేదాభిప్రా యాలు తొలగిపోయాయని, చైనాపై 100 శాతం సుంకం కూడా ఉండబోదని అమెరికా ట్రెజరీ సెక్రటరీ బెసెంట్ ప్రకటించడంతో మళ్లీ స్టాక్ మార్కెట్ పెట్టుబడులు ఆకర్షణీయంగా మారాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం తగ్గడం కూడా మదపర్లకు కొత్త ఊపునిచ్చింది.

# దూసుకువస్తున్న మొంథా తుఫాన్



- కాకినాడ వద్ద తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో భారీగా ఈదురుగాలులు
- గంటకు 90 నుంచి వంద కి.మీ వేగంతో ప్రచండగాలులు

**విశాఖపట్నం,అక్టోబర్28:** బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తీవ్ర తుపానుగా బలపడింది. ఈ మేరకు విశాఖలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది.గంటకు 15 కి.మీ వేగంతో ఉత్తర వాయవ్య దిశగా తుపాను కదిలిందని తెలిపింది. ప్రస్తుతం మచిలీపట్నానికి 190 కి.మీ, కాకినాడకు 270కి.మీ, విశాఖపట్నానికి 340 కి.మీ దూరంలో తుపాను కేంద్రీకృతమైనట్లు వాతావరణ కేంద్రం పేర్కొంది. క్రమంగా ఉత్తర వాయవ్య దిశగా కదులుతోందని తెలిపింది. మంగళవారం సాయంత్రం లేదా రాత్రికి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీవ్ర తుపాను తీరం దాటే అవకాశముందని వెల్లడించింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు గరిష్ఠంగా 110 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేసింది. మొత్తంగా ఆంధ్రా వైపుకు ఎంతో వేగంగా దూసుకొస్తోంది. తుపాను నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేసేందుకు అధికారులు అంతా సిద్ధం చేసుకున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 90-110 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. తుపాను ప్రభావంతో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు అతిభారీ వర్షాలు కురవనున్నాయని తెలిపారు. కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచనలు చేశారు.తీవ్ర తుఫానుగా రూపాంతరం చెందిన మొంథా మరికొన్ని గంటల్లో తీరం దాటనుంది. దీని ప్రభావంతో ఏపీ, ఒడిశా, తెలంగాణ, తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుఫాను ప్రభావంతో ఒడిశా, ఏపీలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. దీంతో బీచ్‌ల వద్ద అధికారులు భద్రతా చర్యలు చేపట్టారు. అలల ప్రభావం ఎక్కువగా ఉండటంతో పర్యాటకులను సముద్రం వైపు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ మైక్‌లలో అనౌన్స్ చేస్తున్నారు.

# కేంద్రానికి దివాళాకోరు విధానం



**ఎల్ఐసి మొత్తాలను ఆదానికి బదలాయించే కుట్ర**

**టీచర్స్ ఎంఎల్‌సి బి గోపీమూర్తి తదితరుల ఆందోళన**

**విజయవాడ,అక్టోబర్28:** ఎల్ఐసిలోని వేల కోట్ల రూపాయలను అదానీకి అప్పనంగా అప్పగించిన కేంద్ర ప్రభుత్వ దివాళాకోరు ఆర్థిక విధానాలపై రాజీలేని పోరాటం సాగించాలని ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి బి గోపీమూర్తి పిలుపునిచ్చారు. ఇన్సూరెన్స్ కంపెనీల ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని, ప్రజాధనాన్ని కాపాడాలని, కార్పొరేట్ అనుకూల విధానాలు విడనాడాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అమెరికా వాషింగ్టన్ పోస్ట్ కథనం ప్రకారం ఎల్ఐసి ధనం రూ.33 వేల కోట్లు అదానీ కంపెనీకి చెల్లించేందుకు జరిగిన చర్చల వివరాలు వెలుగులోకి రావడం దేశ ప్రజలను ఆందోళన గురిచేస్తోందన్నారు. ప్రజలు మౌనంగా ఉంటే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని, పోరాటంతోనే హక్కులను, ఆస్తులను కాపాడుకోవచ్చని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా 15 లక్షల మంది ఎల్ఐసి ఏజెంట్లు ప్రజలను ఒప్పించి ఎల్ఐసిలో ఖాతాదారులుగా మార్చడం ద్వారా సృష్టించిన సంపదపై కార్పొరేట్ల కన్ను పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరిలోనే అదాని గ్రూపు కంపెనీలో ఎల్ఐసి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడితే ఖాతాదారుల కుగాని, దేశ ప్రజలకుగాని తెలియకుండా కేంద్ర ప్రభుత్వం దొంగచాటు వ్యవహారాలు నడుపుతోందని దుయ్యబట్టారు.

# తిరుమలలో మంచు దుప్పటి

**- ముసురు కమ్ముకోవడంతో భక్తులకు ఇక్కట్లు**



**తిరుమల,అక్టోబర్28:** మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం తిరుమలలో వేకువజాము నుంచే ముసురు వాతావరణం కనిపించింది. చిరుజల్లులే కావడంతో భక్తులకు పెద్దగా అసౌకర్యం కలుగలేదు. దట్టమైన పొగమంచు తిరుమలను కప్పేస్తోంది. సాయంత్రానికి చలి తీవ్రత పెరిగింది. తుఫాన్ ప్రకటనల నేపథ్యంలో రద్దీ కూడా తక్కువగానే ఉంది. ఆలయ పరిసరాల్లో భక్తులు పలుచగా కనిపించారు.పదిరోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తిరుమల ఘాట్‌రోడ్లపై ఫారెస్ట్, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. తరుచూ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలపై దృష్టి పెట్టారు. అనుకోకుండా కొండరాళ్లు, చెట్లు విరిగిపడితే వెంటనే స్పందించేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఘాట్‌రోడ్లలో నెమ్మదిగా ప్రయాణించాలని, చెట్ల కింద ఉండకూడదంటూ ప్రకటనలు చేశారు.

# మొంథా తుపాన్‌పై ఆరా రైల్వే మంత్రి కీలక ఆదేశాలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** మొంథా తుపాన్ అలజడి ప్రభావ ప్రాంతాల్లోని ప్రతి రైల్వే విభాగంలో అత్యవసర నియంత్రణ కేంద్రాలు (వార్ రూమ్స్) తక్షణమే ఏర్పాటు చేయాలని ఉన్నతాది కారులను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదేశించారు. రైల్వే వ్యవస్థలు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని.. అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు వెంటనే చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆయన స్పష్టం చేశారు. ఈ తుపాన్ తూర్పు తీరంపై ప్రభావం చూపనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం న్యూఢిల్లీలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తుపాన్ వాస్తవ పరిస్థితులను అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. అయితే ఈ తుపాన్ ప్రభావం ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో ఉంటుందని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు వెంటనే చేపట్టాలని ఆయన ఆదేశించారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు డివిజనుల్లో అవసరమైన సామగ్రి, యంత్ర పరికరాలను ముందుగానే సిద్ధం చేసుకోనేలా సిబ్బందిని ఆదేశించాలని సూచించారు. ఈ తుపాన్ ప్రభావం కారణంగా ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా రైళ్ల రాకపోకలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే , సౌత్ సెంట్రల్ కోస్ట్ రైల్వే , సౌత్ సెంట్రల్ రైల్వే జోన్లలో అత్యవసర పరిస్థితులపై వెంటనే స్పందించేందుకు తగిన వనరులు, సిబ్బందితోపాటు యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని సూచించారు. ప్రజల ప్రాణ రక్షణ, ప్రయాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి విభాగం సమన్వయంతో ముందుగానే సిద్ధమై ఉంటే.. ఈ తుపాన్ ప్రభావాన్ని గణనీయంగా తగ్గించ వచ్చునని అభిప్రా యపడ్డారు. రైల్వే వ్యవస్థలు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదేశించారు.

# : ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఎయిరిండియా బస్సు దగ్ధం



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిరిండియా బస్సు దగ్ధమైంది. విమానాశ్రయం మూడో టెర్మినల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎయిర్‌క్రాఫ్ట్ రెస్క్యూ సిబ్బంది, అగ్నిమాక సిబ్బంది వెంటనే మంటలను అదుపు చేశారు. ట్యాక్సీయింగ్ ఏరియాలో నిలిపి ఉంచిన విమానానికి అత్యంత సమీపంలో ఈ ఘటన జరిగినప్పటికీ ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రౌండ్ హ్యాండిలర్స్‌కు చెందిన బస్సు మధ్యాహ్నం సమయంలో మంటల్లో చిక్కుకుందని, అయితే ఏఆర్ఎఫ్ఎఫ్ నిపుణుల బృందం రెండు నిమిషాల్లోనే మంటలను అదుపు చేసిందని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారిక 'ఎక్స్' ఖాతాలో తెలియజేసింది. ఘటన సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ నష్టం జరగలేదని తెలిపింది. విమాన సర్వీసులు యథాప్రకారం నడుస్తున్నాయని తెలిపింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రత తమకు అత్యంత ప్రాధాన్యమని పేర్కొంది. విజయవాడ విమానాశ్రయంలోనూ.కాగా, ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరం విమానాశ్రయంలోని కస్టమ్స్ అధికారుల గదిలో మంగళవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో సాఫ్ట్‌వేర్ సామగ్రి దెబ్బతింది. మంటలు విస్తరించకుండా అగ్నిమాపక సిబ్బంది వెంటనే మంటలను అదుపుచేసారు. ప్రమాదానికి కారణం వెంటనే తెలియలేదు.

# ఉద్యోగులకు శుభవార్త- 8వ పే కమిషన్‌కు కేంద్రం ఆమోదం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కార్ శుభవార్త చెప్పింది. లక్షలాది మంది ఉద్యోగుల జీతాలు, విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు పెంచేందుకు 8వ వేతన సంఘం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. దీనికి సుప్రీం కోర్టు విశాంత్ర న్యాయమూర్తి జస్టిస్ రంజన దేశాయ్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. ఈ కమిషన్ సిఫార్స్‌లతో 50లక్షల మంది కేంద్రప్రభుత్వ ఉద్యోగులు, 69లక్షల మంది పింఛనుదారులకు ప్రయోజనం కలుగనుందని సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. మరోవైపు రూ.37,952 కోట్ల ఎరువుల రాయితీకి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ కమిషన్‌కు జస్టిస్ రంజనప్రకాశ్ దేశాయ్ సారథ్యం వహించనుండగా ఐఐఎం బెంగళూరు ఆచార్యుడు పాలుక్‌ఘోష్ తాత్కాలిక సభ్యుడిగా, పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్ సభ్య కార్యదర్శిగా ఉంటారు. జస్టిస్ దేశాయ్ కమిషన్ 18నెలల్లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. 8వ వేతన సంఘం సిఫారుసులు జనవరి ఒకటి నుంచి అమలయ్యే అవకాశం ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 7వ వేతన సంఘం 2014 ఫిబ్రవరి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సిఫారుసులు 2016 జనవరి నుంచి అమలు అయ్యాయి. 7వ కమిషన్ 2026తో ముగియనుంది. ఈ క్రమంలోనే 8వ పే కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై పలువురు కేంద్ర మంత్రులు, మంత్రిత్వ విభాగాల సిబ్బందితో విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపిన తర్వాత కమిషన్‌ను ఏర్పాటు చేసింది. పదేళ్లకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం, వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. ఆ కమిషన్? చేసిన సిపారుసులు అమలు చేస్తోంది. దేశంలో సుమారు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మంది పింఛనుదారుల వేతనాలు, భత్యాలు ఎంత ఉండాలో నిర్ణయించడంలో వేతన సంఘం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతమున్న జీతాలు, పింఛన్లను ఎంత మేర పెంచాలో ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం వేతన సవంౕణ చేపడుతుంది. 7వ వేతన సంఘం 2014 ఫిబ్రవరి మన్మో హన్ సింగ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సిఫారుసులు 2016 జనవరి నుంచి అమలు అయ్యాయి. ఎరువుల రాయితీకి ఆమోదం2025-26 రబీ సీజన్‌కు సంబంధించి ఫాస్ఫేట్ అండ్ పొటాషియం ఎరువులపై సబ్సిడీ రేట్లను నిర్ణయించే ప్రతిపాదనను కేంద్రం ఆమోదం తెలిపిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఎరువుల రాయితీకి రూ.37,952 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఇది 2025 ఖరీఫ్ సీజన్ కంటే రూ.736 కోట్లు ఎక్కువ అని చెప్పారు. డై అమ్మోనియం ఫాస్ఫేట్ , నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాష్, సల్ఫర్ వంటి ఎరువులపై ఆమోదించిన రేట్ల ప్రకారం సబ్సిడీలు అందించనున్నట్లు తెలిపారు. దీనివల్ల రైతులకు సబ్సిడీతో, సరసమైన ధరలకు ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

# ఉద్యోగులకు స్వీట్ న్యూస్ భారీగా పెరగనున్న జీతాలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్ దారుల.. జీతాలు, పెన్షన్లు పెంచేందుకు వీలుగా 8వ వేతన సంఘం(8 ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంగళవారం నాడు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కేబినెట్ మీటింగ్ అనంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. 8వ వేతన సంఘానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జ్ జస్టిస్ రంజన దేశాయ్ ఈ వేతన సంఘానికి ఛైర్ పర్సన్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు సభ్యులు ఈ కమిటీలో ఉంటారని చెప్పారు.కాగా, ప్రస్తుతం అమల్లో ఉన్న 7వ వేతన సంఘం కాలపరిమితి 2026 సంవత్సరంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త వేతన సవరణలను అమలు చేసేందుకై 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్ర సిద్ధమైంది. దీనిపై జనవరి నెలలోనే కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన కూడా విడుదల చేసింది. కేంద్ర మంత్రులు, మంత్రిత్వ శాఖలు, అధికారులతో చర్చోపచర్చల అనంతరం 8వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది ప్రభుత్వం. ఈ కమిషన్ తన నివేదికను 18 నెలల్లో ఇవ్వనుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

# బిహార్ ఎలక్షన్స్- ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన మహాగఠ్‌బంధన్




**బిహార్ :**27 మంది రెబల్స్‌పై ఆర్జేడీ వేటుపాట్నా: ఛట్ ఫెస్టివల్ పూర్తికా వడంతో బిహార్ లో ఎన్నికల వేడి ఊపందుకుంది. అన్ని ప్రధాన పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్‌తో సందడి చేస్తున్నాయి. ఇదే సమయంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నేతలపై బహిష్కరణ వేట్లు కూడా పడుతున్నాయి. 27 మంది నాయకులపై ప్రతిపక్ష ఆర్జేడీక్రమశిక్షణా చర్యలు తీసుకుంది. పార్టీ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరిస్తూ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించింది. వివిధ నియోజక వర్గాల్లో పలువురు నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో ఉండటం, పార్టీ నామినీలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నట్టు వస్తున్న వార్తలతో క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్టు ఆర్జేడీ ప్రధాన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. బహిష్కరణకు గురైన వారిలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు చోటే లాల్‌రాయ్, మమ్మద్ క్రమాన్, మరో నలుగురు మాజీ ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ కూడా ఉన్నారుమహాఘట్‌బంధన్ మేనిఫెస్టోవిపక్ష మహాఘట్‌బంధన్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసేందుకు సిద్ధమైంది. బిహార్ ఎలక్షన్స్- ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన మహాగఠ్‌బంధన్‌బిహార్ ఓటర్లను ఆకర్షించడమే లక్ష్యంగా మహాగఠ్‌బంధన్ కూటమి మంగళవారం పట్నాలో తమ ఎన్నికల మేనిఫేస్టో విడుదల చేసింది. "తేజస్వి ప్రతిజ్ఞ ప్రాణ్?" పేరుతో విడుదల చేసిన ఈ మేనిఫెస్టోలో- యువత, మహిళలు, రైతులు, పేదలపై వరాల జల్లు కురిపించారు. పట్నాలోని ఓ ప్రముఖ హోటల్?లో మహాగఠ్?బంధన్? మేనిఫెస్టో విడుదల చేశారు. కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవ్?, కాంగ్రెస్? వామపక్ష పార్టీలతో సహా మహాగఠ్‌బంధన్ కూటమిలోని ప్రముఖ నేతలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీఐపీ నుంచి ముకేశ్ సాహ్ని, కాంగ్రెస్ నుంచి మదన్‌మోహన్ ఝా, ఐఐపీ నుంచి ఐపీ గుప్తా, మాలే నుంచి దీపాంకర్ భట్టాచార్య, సీపీఐ నుంచి రామ్‌నరేష్ పాండే మొదలైనవారు ఉన్నారు. వరాల జల్లుమహాగఠ్‌బంధన్ కూటమి తమ మేనిఫెస్టోలో వరాల జల్లు కురిపించింది. బిహార్?లోని ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగాలు, భూమి లేని కుటుంబాలకు 5 డెసిమిల్ భూమి, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి కీలక వాగ్దానాలు ఇచ్చారు. ఉద్యోగాలు, ద్రవ్యోల్బణం, విద్య, రైతుల సంక్షేమ వంటి కీలక అంశాలు మేనిఫెస్టోలో చోటుచేసుకోనున్నాయి. మహిళలకు ప్రతినెలా రూ.2.500 ఆర్థిక సాయం, రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్య చికిత్స, భూముల్లేని కుటుంబాలకు 3 నుంచి 5 సెంట్ల భూమి కేటాయించడం వంటి హామీలను ఇవ్వనుంది. బిహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతలుగా నవంబర్ 6,11 తేదీల్లో జరుగనుండగా, నవంబర్ 14న ఫలితాలు వెలువడతాయి.

# ప్రశాంత్ కిషోర్‌కు ఎన్నికల కమిషన్ నోటీసు




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీవ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ కు ఎన్నికల కమిషన్ మంగళవారంనాడు షోకాజ్ నోటీసు ఇచ్చింది. బిహార్‌తో పాటు పశ్చిమబెంగాల్ ఓటర్ల జాబితాలోనూ ఆయన పేరు కనిపించడంతో ఈసీ ఈ చర్యలకు దిగింది. బిహార్‌లో రోహటాస్ జిల్లా ససరాంలోని కర్గాహార్ అసెంబ్లీ నియోజవవర్గం రిటర్నింగ్ అధికారి ఈ నోటీసులు పంపారు. కర్గాహార్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 621లో ఎపిక్ (ఓటర్ ఐడి) నంబర్ 1013123718 కింద ఓటరుగా ఆయన పేరు నమోదైందని, ఇదే సమయంలో పశ్చిమబెంగాల్‌లోని భాబనిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సెయింట్ హెలెన్ స్కూలు పోలింగ్ బూత్‌లో కూడా ఆయన పేరు నమోదై ఉందని ఆ నోటీసులో రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1950 లోని సెక్షన్ 17 కింద ఒక వ్యక్తి ఒకటికి మించిన నియోజకవర్గాల్లో పేరు నమోదు చేసుకోరాదు. అలా చేసినట్లయితే సెక్షన్ 31 కింద ఏడాది జైలు లేదా జరిమానా.. ఒక్కోసారి రెండూ విధించే అవకాశం ఉంది. రెండు వేర్వేరు రాష్ట్ర ఓటర్ల జాబితాల్లో పేర్ల నమోదుపై మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ప్రశాంత్ కిషోర్‌ను ఎన్నికల కమిషన్ కోరింది. కాగా, బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నందున ఈసీ నోటీసులపై ప్రశాంత్ కిషోర్ వెంటనే స్పందించలేదు.

# మా బంధం పటిష్ఠం రాహుల్ ఆప్యాయత అమోఘం



**చెన్నై:** డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు పూర్వం సిద్ధాంతపరంగా వేర్వేరు మార్గాల్లో పయనించినా ప్రస్తుతం దేశ సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి ఒకే కూటమిలో కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్( పేర్కొన్నారు. మతతత్వపార్టీ బీజేపీకి వ్యతిరేకంగా రెండు పార్టీలూ సమైక్యంగా పోరాడుతున్నాయని చెప్పారు. దేశ సంక్షేమం కోసం పాటుపడటమే రెండు పార్టీల ఆశయమని, ఆ ఆశయ సాధన కోసం నిర్విరామంగా పోరాడుతామన్నారు. మంగళవారం ఉదయం అరివాలయం లోని కలైంజర్ అరంగంలో జరిగిన విరుదునగర్ ఈస్ట్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శ్రీరాజా చొక్కర్ కుమారుడు శివరాజా శ్రీ రాజా వివాహవేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దేశ సంక్షేమం కోసం ప్రత్యేకించి దేశసమైక్యత కోసం కాంగ్రెస్, డీఎంకే పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని, కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలను ఎన్నడూ మరువలేనన్నారు. రాహుల్ తనను వ్యక్తిగతంగా కలిసినప్పుడు డియర్ బ్రదర్ అనే సంబోధిస్తారని చెప్పారు. దేశ సంక్షే మం కోసం ప్రత్యేకించి దేశసమైక్యత కోసం కాంగ్రెస్, డీఎంకే పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని, కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలను ఎన్నడూ మరువలేనన్నారు.ానింతవరకూ ఏ పార్టీ నాయకులను సోదరుడని సంబోధించలేదని పేర్కొన్నారు. దంతా తాను ఎందుకు చెబుతున్నానంటే పార్టీల సిద్ధాంతాలకు అతీతంగా, కాంగ్రెస్, డీఎంకే మధ్య విడదీయలేని రాజకీయ అనుబంధంతోపాటు, ఆత్మీయ అనుబంధం కూడా పటిష్ఠంగా ఉందని చెప్పడానికేనని స్టాలిన్ అన్నారు. తన సమక్షంలో ఆదర్శవివాహం చేసుకున్న దంపతులు తమకు పుట్టబోయే బిడ్డలకు తమిళ పేర్లు పెట్టాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదర్శవివాహాలు చట్టబద్ధం కాకముందు కాంగ్రెస్ ఈ వివాహాలను పెద్దగా పట్టించుకోలేదని, 1967 తర్వాత రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వివాహాలు చెల్లుబాటు అయ్యేలా కొత్త చట్టమే తీసుకొచ్చారని ఆయన వివరించారు.

# కీలక ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం సీఎంఎస్-3ని నింగిలోకి పంపనున్నది. ఇండియన్ నేవీ కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఉపగ్రహాన్ని నింగిలోకి పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. ఎల్‌వీఎం 3 రాకెట్ ఈ ఉపగ్రహాన్ని నవంబర్ 2న నింగిలోకి మోసుకెళ్లనున్నది. ఏపీలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగాన్ని ఇస్రో చేపట్టనున్నది. ఈ ఉపగ్రహాన్ని జీశాట్ 7ఆర్ అని పిలుస్తుంటారు. ఇది శాటిలైట్‌ను పూర్తిగా భారత సైన్యం అవసరాల కోసం తయారు చేసిన మల్టీ బ్యాండ్ కమ్యూనికేషన్ శాటిలైట్. దీని బరువు దాదాపు 4,400 కిలోల వరకు ఉంటుంది. ఇస్రో తొలిసారిగా భారీ బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్‌ను భూస్థిర బదిలీ కక్ష్యలోకి ప్రవేశపెట్టనుండడం విశేషం. ఈ శాటిలైట్ భారత భూభాగంతో పాటు సముద్ర జలాల్లోనూ సేవలందిస్తుందని ఇస్రో తెలిపింది. ఈ శాటిలైట్ 2013లో ప్రయోగించిన జీశాట్ 7 రుక్మిణి స్థానంలో సేవలు అందించబోతున్నది. అడ్వాన్స్‌డ్ పేలోడ్స్‌తో తయారు చేసిన ఈ శాటిలైట్ హిందూ మహాసముద్రంతో పాటు కీలక ప్రాంతాల్లో నేవీ కార్యకలాపాలు కొనసాగించే సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. వాయిస్, డేటా, వీడియో లింక్‌ల కోసం సీ, ఎక్స్‌టెండెడ్ సీ, క్యూ-బ్యాండ్స్‌లో కమ్యూనికేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయి. శాటిలైట్‌ను సైతం ఇదే ఎల్‌వీఎం 3 రాకెట్ నింగిలోకి మూసుకెళ్లనున్నది. ఇందుకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు.

# అసలు ఈ ఎలక్ట్రిక్ బస్సులతోనే సమస్య

**- ప్రమాదాలు, బ్రేక్‌డౌన్‌లకు అవే కారణం**

**- రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి**



**బెంగళూరు:** ఎలక్ట్రికల్ బస్సులతోనే సమస్య నెలకొందని తరచూ నగరంలో ప్రమాదాలు, బ్రేక్‌డౌన్‌లకు అవే కారణమని రవాణాశాఖ మంత్రి రామలింగారెడతెలిపారు. విధానసౌధలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. యూపీఏ పాలనలో ఎలక్ట్రికల్ బస్సులకు 80శాతం రాయితీ ఇచ్చి కార్పొరేషన్‌లకు అప్పగించేవారన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను సదరు సంస్థలకే అప్పగించారన్నారు. వారు నియమించినవారే డ్రైవర్లుగా ఉన్నారని, నిర్వహణ లేకపోవడంతో తరచూ బ్రేక్‌డౌన్‌లు అవుతున్నాయన్నారు. ప్రస్తుతం ఎన్‌టీపీసీ 90 బస్సులు, స్విచ్ మొబిలిటీ 300 బస్సులు, టీఎంఎల్ స్మార్ట్‌సిటీ బస్సులు 1031, ఓహెచ్ఎం గ్లోబల్ 251 బస్సులు ఉన్నాయన్నారు. చార్జింగ్‌స్టేషన్‌లు ప్రతిడిపోలోనూ అనుకూలం చేశామన్నారు. అయినా బస్సులలో సాంకేతిక వైఫల్యాలు, బ్యాటరీ సంబంధిత సమస్యలు, ప్రమాదాల సంఖ్య పెరగడం, బస్సుల నిర్వహణా లోపం, అనుభవం లేని డ్రైవర్లు, బస్సులు నిరంతరం జాప్యం, డ్రైవర్ల కొరత, డ్రైవర్ల ఆందోళన వంటివి వెంటాడుతున్నాయ న్నారు. గతంలో మాదిరిగా కార్పొరేషన్లకు బస్సులను పూర్తిసా ్థయిలో అప్పగిస్తే పర్యవేక్షణ సముచితంగా ఉంటుందన్నారు. ఇదే విషయమై కేంద్రమంత్రి కుమారస్వామికి ప్రత్యేక లేఖ పంపానన్నారు. బెంగళూరులో అందుబాటులో ఉన్నప్పుడు భేటీ అవుతానన్నారు. ఎలక్ట్రిక్ బస్సు కంపెనీల నిర్వాహకులతోనే పది విడతలకుపైగా ప్రత్యేక సమావేశాలు జరిపామని, అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు

# తొలి టీ20 భారత తుది జట్టు ఇదే



ఆస్ట్రేలియా, భారత్ మధ్య అక్టోబర్ 29(బుధవారం) నుంచి ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది జరగనున్న టీ20 ప్రపంచ కప్న( 2026)కు సన్నాహకంగా ఈ సిరీస్‌ను ఉపయోగించుకోవాలని టీమిండియా చూస్తోంది. 5 మ్యాచ్‌ల సిరీస్‌లో మొదటి మ్యాచ్ కాన్‌బెర్రాలోని మనుకా ఓవల్ వేదికగా జరగనుంది. 2-1 తేడాతో వన్డే సిరీస్ కోల్పోయిన టీమిండియా.. పొట్టి సిరీస్ అయినా పట్టాలనే పట్టుదలతో ఉంది.పొట్టి ఫార్మాట్‌లో ఆస్ట్రేలియాపై భారత్‌కు మంచి రికార్డే ఉంది. ఇప్పటి వరకు ఆడిన 32 మ్యాచ్‌ల్లో 20 సార్లు గెలుపొందింది. ఆసీస్ కేవలం 11 మ్యాచ్‌ల్లో మాత్రమే విజయం సాధిం చింది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో భారత యువ జట్టు ఇదే ఫామ్‌ను కొనసాగించాలని భావిస్తోంది. ఇటీవలి కాలంలో సూపర్ ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లపై అభిమానుల భారీగా అంచనాలు పెట్టు కున్నారు.విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ అద్భుతంగా రాణిస్తున్నాడు. వన్ డౌన్‌లో తిలక్ వర్మ అదరగొడుతున్నాడు. సంజూ శాంసన్ సక్సెస్ ట్రాక్‌లోనే ఉన్నాడు. గిల్ నుంచి స్థాయికి తగ్గ ఇన్నింగ్స్‌లు బాకీ ఉన్నాయి. శివమ్ దూబే, అక్షర్ పటేల్ ఆల్‌రౌండర్లుగా సత్తా చాటుతున్నారు. వరుణ్ చక్రవర్తి పర్వాలేదనపిస్తున్నాడు. బుమ్రా, అర్ష్‌దీప్ రాణిస్తున్నారు. ప్రస్తుతం కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ ఫామ్ ఒక్కటే టీమిండియాను కలవరపెడుతుంది. ఈ ఆసీస్ సిరీస్‌లో అయినా లయ అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఇప్పటికే సూర్య ఫామ్‌పై హెడ్ కోచ్ గంభీర్ కూడా స్పందించాడు. ఫామ్ అనేది సమస్యే కాదని స్పష్టం చేశాడు.తొలి టీ20.. భారత జట్టు అంచనా!అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజు శాంసన్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా.

# సూర్య ఫామ్ సమస్యే కాదు: గంభీర్



సూర్య కుమార్ యాదవ్. టీమిండియాటీ20 జట్టు కెప్టెన్ అయ్యాక పెద్దగా రాణించలేకపోతున్నాడు. ఇటీవల జరిగిన ఆసియా కప్‌లోనూ నిరాశపరిచాడు. 7 మ్యాచ్‌లు ఆడి కేవలం 72 పరుగులే చేశాడు. అయితే ఈ విషయంపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీం "స్పందించాడు. దూకుడుగా ఆడే క్రమంలో సూర్య త్వరగా ఔటవుతున్నాడని, కాబట్టి అతడి ఫామ్ గురించి ఆందోళన పడటం అనవసరమని అన్నాడు. 'నిజాయితీగా చెప్పాలంటే సూర్య కుమార్ యాదవ్ బ్యాటింగ్ ఫామ్ నన్ను పెద్దగా కలవర పెట్టట్లేదు. ఎందుకంటే డ్రెస్సింగ్ రూంలో మేం దూకుడైన బ్యాటింగ్ శైలికి ప్రణాళిక రూపొందించుకున్నాం. దాన్ని అనుసరించినప్పుడు వైఫల్యాలు కూడా ఎదురవుతుంటాయి. 30 బంతుల్లో 40 పరుగులు చేయడం సూర్యకు తేలికైన విషయం. అలా చేసి కూడా విమర్శలను తప్పించుకునే వెసులుబాటు ఉంది.కానీ మేం అలా చేయాలని అనుకోవడం లేదు. దూకుడుగా ఆడి వైఫల్యం ఎదురైనా అంగీకరించాలని కలసికట్టుగా నిర్ణయం తీసుకున్నాం. ఆసియా కప్‌లో అభిషేక్ శర్మ గొప్పగా ఆడాడు. అతడు ఇదే ఫామ్‌ను ఆస్ట్రేలియాతో సిరీస్‌లోనూ కొనసాగించాలని ఆశిస్తున్నాం. సూర్య కూడా ఫామ్ అందుకుంటే అతడు మరింత బాధ్యత తీసుకుంటాడు. సూర్య మంచి మనిషి. మంచి మనుషులే మెరుగైన నాయకులు అవుతారు. జట్టు తనది. ఆటను గమనించి అతడికి సరైన సలహాలు ఇవ్వడమే నా పని' అని గంభీర్ వివరించాడు.

# శ్రేయస్ ఆరోగ్యం నిలకడగానే ఉంది: సూర్యకుమార్




టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో అలెక్స్ క్యారీ ఇచ్చిన క్యాచ్‌ను అందుకునే క్రమంలో కిందపడిపోయాడు. అతడి పక్కటెముకలు నేలకు బలంగా తాకడంతో అతడి ప్లీహానికి తీవ్ర గాయమైంది. అంతర్గత రక్తస్రావం కావడం వల్ల శ్రేయస్‌ను ఐసీయూలో చేర్చి చికిత్స అందించారు. ఈ నేపథ్యంలో టీమిండియా టీ20 కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్.. శ్రేయస్ గాయంపై కీలక విషయాలు వెల్లడించాడు. 'శ్రేయస్ గాయపడ్డాడని తెలిసిన వెంటనే అతడికి ఫోన్ చేశాను. కానీ మొబైల్ అతడి దగ్గర లేదని తెలిసింది. మళ్లీ వెంటనే ఫిజియో కమలేశ్ జైన్‌కు ఫోన్ చేసి మాట్లాడాను. పెద్దగా కంగారు పడాల్సిన అవసరం లేదని చెప్పాడు. అయ్యర్‌తో కూడా మాట్లాడించాడు. గత రెండు రోజులుగా అయ్యర్ నాతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అతడి ఆరోగ్యం నిలకడగానే ఉంది. కొన్ని రోజులు డాక్టర్ల పర్యవేక్షణలో ఉండనున్నాడు. ప్రస్తుతం శ్రేయస్ అందరికీ స్పందిస్తున్నాడు. అందరితోనూ మాట్లాడుతున్నాడు. ఇది మంచి విషయం' అని సూర్య వ్యాఖ్యానించాడు. మరోవైపు టీమిండియా ఫిజియోలను బీసీసీఐ చీఫ్ ప్రత్యేకంగా అభినందించారు. వారు వేగంగా స్పందించి ఆసుపత్రికి తరలించడం వల్లే అయ్యర్‌కు ప్రాణాపాయం తప్పిందని అన్నారు.రీఎంట్రీ అప్పుడేనా..?శ్రేయస్ అయ్యర్‌కు అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పింది. ప్లీహం గాయం నుంచి పూర్తిగా కోలుకునేందుకు కనీసం మూడు నెలల సమయం పడుతుందని డాక్టర్లు తెలిపారు. దీంతో శ్రేయస్ మైదానంలో బ్యాట్ పట్టేందుకు సుదీర్ఘ సమయమే పట్టనుంది. దీని ప్రకారం ఐపీఎల్ 2026(%శ్రూ% 2026)లో శ్రేయస్ మైదానంలోకి రీఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

# ముగ్గురు స్పిన్నర్లకు చోటు భారత్‌తో టెస్టు సిరీస్‌కు సఫారీ జట్టు ప్రకటన



జోహన్నెస్‌బర్గ్: వచ్చేనెల 14 నుంచి భారత్‌తో రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనున్న దక్షిణాఫ్రికా 15 మందితో కూడిన తమ జట్టును ప్రకటించింది. డబ్ల్యూటీసీ టైటిల్ గెలిచాక ఎడమ కాలిగాయంతో పాకిస్థాన్‌తో జరిగిన టెస్టులకు దూరమైన కెప్టెన్ టెంబా బవుమా తిరిగి జట్టులోకి వచ్చాడు. ఉపఖండపు పిచ్‌లకు అనుగుణంగా సౌతాఫ్రికా.. ముగ్గురు స్పిన్నర్లను జట్టులో చేర్చింది.స్పిన్ విభాగానికి కేశవ్ మహారాజ్ సారథ్యం వహించనుండగా సెనురన్ ముత్తుస్వామి, సైమన్ హార్మర్ తుది జట్టులో ఉండే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఇక బవుమా రాకతో డేవిడ్ బెడింగ్‌హామ్ జట్టుకు దూరమవ్వగా పాకిస్థాన్ జట్టుతో ఆడిన సభ్యులే భారత్‌తో సిరీస్‌లోనూ ఉన్నారు. నవంబర్ 14-18 మధ్య కోల్‌కతాతో తొలి టెస్టు, 22-26 మధ్య గువహతితో రెండో టెస్టు జరుగనుంది.సౌతాఫ్రికా జట్టు: బవుమా (కెప్టెన్), బాష్, బ్రెవిస్, టోని డి జోర్జి, జుబైర్ హమ్జా, హార్మర్, యాన్సెన్, మహారాజ్, మార్క్రమ్,( మల్డర్, ముత్తుస్వామి, రబాడా, రికెల్టన్, స్టబ్స్, వెరియానె.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్ 8వ పే కమిషన్‌కు ఆమోదం




కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రంలోని మోదీ సర్కారు శుభవార్త చెప్పింది. 8వ వేతన కమిషన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం కేంద్ర కేబినెట్ సమావేశమైంది. ఈ సందర్భంగా కేబినెట్‌లో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వేతన కమిషన్‌కు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి రంజనా ప్రకాశ్ దేశాయ్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. కమిషన్‌లో చైర్‌పర్సన్‌తో పాటు సభ్యుడు (పార్ట్‌టైమ్), సభ్య కార్యదర్శి ఉంటారు. ప్రస్తుతం 7వ వేతన సవరణ సంఘం కాలపరిమితి 2026తో ముగియనున్నది. ఈ క్రమంలో కొత్త వేతన సవరణ అమలు చేయడానికి వీలుగా 8వ పే కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జనవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.ఈ విషయంలో కేంద్ర మంత్రులతో పాటు మంత్రిత్వ విభాగాల సిబ్బందితో విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపింది. అనంతరం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 8వ వేతన సంఘం 18 నెలల్లోగా సిఫా రసలు సమర్పిస్తుందని కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అశ్విని వైష్ణ వ్ వెల్లడించారు. కమిషన్ సిఫార్సులు రక్షణ సేవా సిబ్బంది సహా దాదాపు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పెన్షనర్ల వేతనాలు, భత్యాలు ఎంత ఉండాలో నిర్ణయించడంలో కమిషన్ కీలక పాత్ర పోషిస్తుంది. ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఉన్న జీతం, పింఛన్‌ను ఎంత వరకు పెంచాలో ఈ వేతన సంఘం కేంద్రానికి సిఫారసు చేరస్తుంది. కేంద్ర ప్రభుత్వం వేతన సవరణ చేస్తుంది.

# ఈ కార్డు ఉంటే రూ.5 లక్షల వరకూ హాస్పిటల్ ఖర్చులు ఫ్రీ! ఇలా అప్లై చేసుకోండి!




ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన 2025 పథకం అనేది భారత ప్రభు త్వం యొక్క అతిపెద్ద ఆరోగ్య బీమా పథకాలలో ఒకటి. దీన్నే ఆయుష్మాన్ కార్డు అని కూడా అంటారు. ఇది ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుం బాలకు చేయూతనిస్తుంది. ఇందులో భాగంగాఏడాదికి రూ. 5 లక్షల వరకూ హెల్త్ ఇన్సూరెన్స్ లభిస్తుంది. దీనికి అర్హత పొందిన వారికి ప్రభు త్వం గుర్తింపు కార్డుని జారీ చేస్తుంది. అదే ఆయుష్మాన్ కార్డ్. ఈ కార్డు కలిగిన వ్యక్తులు లేదా కుటుంబాలు ఎంప్యానెల్డ్ ఆసుపత్రులలో ఉచిత ఆరోగ్య సేవలను పొందగలుగుతారు. ఈ కార్డు దేశవ్యాప్తంగా ఉన్న ప్రభు త్వ, లిస్టెడ్ ప్రైవేట్ ఆసుపత్రులలో చెల్లుతుంది, ఇక్కడ గుండె జబ్బులు, క్యాన్సర్, డయాలసిస్, శస్త్రచికిత్స వంటి తీవ్రమైన అనారోగ్యాలకు కూడా ఉచితంగా చేయబడుతుంది. ఎలిజిబిలిటీప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజనకు అందరూ అర్హులు కారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఈ పథకం తీసుకొచ్చారు. ఒకే గదిని కలిగి ఉన్న నివాసాలలో నివసించే కుటుంబాలు. 16 నుండి 59 సంవత్సరాల వయస్సు గల వయోజన పురుష సభ్యుడు లేని కుటుంబాలు. ఎలాంటి సపోర్ట్ లేని దివ్యాంగుల కుటుంబాలు, ఆర్థికంగా వెనుకబడిన షెడ్యూల్డ్ కులాలు లేదా షెడ్యూల్డ్ తెగలకు చెందిన కుటుంబాలు, సొంత భూమిలేని కుటుంబాలు, గృహ కార్మికులు, స్ట్రీట్ వెండర్స్, పారిశుధ్య కార్మికులు, రవాణా కార్మికులు (డ్రైవర్లు, కండక్టర్లు) వంటి వాళ్లు ఈ పథకానికి అర్హులు. అదేవిధంగా 70 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లందరికీ వారి సామాజిక-ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఈ పథకం వర్తిస్తుంది.అప్లికేషన్ ప్రాసెస్ముందుగా అధికారిక ఆయుష్మాన్ భారత్ పోర్టల్(కు వెళ్లాలి.అక్కడ ప్రాథమిక వివరాలను నమోదు చేయడం ద్వారా మీకు ఎలిజిబిలిటీ ఉందో లేదో చెక్ చేయొచ్చు. ఒకవేళ ఎలిజిబుల్ అయితే వెంటనే కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఎంప్యానెల్డ్ ఆసుపత్రులు లేదా కామన్ సర్వీస్ సెంటర్‌లను సందర్శించాలి. అప్లికేషన్ ప్రాసెస్ ను పూర్తి చేయడానికి ఆధార్ కార్డ్ లేదా రేషన్ కార్డ్ వంటి అవసరమైన గుర్తింపు పత్రాలను తీసుకెళ్లాలి.

# పోస్టాఫీసులో సూపర్ స్కీమ్



రిటైర్‌మెంట్ తర్వాత ఆర్థిక భద్రత గురించి ఆందోళన చెందుతున్న సీనియర్ సిటిజన్లకు పోస్ట్ ఆఫీస్ ఒక అద్భుతమైన పథకాన్ని అందిస్తోంది. జీతం ఆగిపోయినా, ఖర్చులు అలాగే ఉండే ఈ సమయంలో నెలవారీ స్థిర ఆదాయాన్ని అందించే ఈ పథకం పేరు సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్. రిటైర్‌మెంట్ తర్వాత వచ్చిన డబ్బును పెట్టుబడి పెట్టడానికి ఈ పథకం ఒక నమ్మకమైన, సురక్షితమైన మార్గంగా ఉంది.అధిక వడ్డీ రేటుప్రస్తుతం పోస్ట్ ఆఫీస్ సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా 8.2 శాతం చొప్పున ఆకర్షణీయమైన వడ్డీ రేటు లభిస్తుం ది. కేవలం రూ. 1,000 పెట్టుబడితో ఈ పథకంలో ఖాతాను తెరవవ చ్చు. ఈ పథకంలో గరిష్టంగా రూ. 30 లక్షలు వరకు పెట్టుబడి పెట్టవ చ్చు.రూ. 30 లక్షలు పెడితే ఎంత వస్తుంది?ఈ పథకంలో అత్యధికంగా రూ. 30 లక్షలు పెట్టుబడి పెట్టినట్లయితే.. మీకు మంచి ఆదాయం వస్తుంది.వార్షిక వడ్డీ 8.2శాతం వడ్డీ రేటు ప్రకా..రం సంవత్సరానికి రూ. 2,46,000 లభిస్తుంది.ఈ స్కీమ్ వడ్డీ రేటు త్రైమాసికానికి ఒకసారి అకౌంట్‌లో జమ చేస్తారు. అంటే ప్రతి 3నెలలకు ఒకసారి రూ.61,500 మీకు లభిస్తాయి. దీని ప్రకారం చూస్తే.. సీనియర్ సిటిజన్లకు ప్రతి నెలా సుమారు రూ.20,500 స్థిర ఆదాయం లభిస్తుంది.మెచ్యూరిటీ %-% పన్ను మినహాయింపుపోస్ట్ ఆఫీస్ సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ మెచ్యూరిటీ వ్యవధి 5 సంవత్సరాలు. మెచ్యూరిటీ కాలం తర్వాత దీనిని మరో 3 సంవత్సరాలు పొడిగించుకునే అవకాశం కూడా ఉంది. ఈ పథకంలో పెట్టుబడి పెట్టడం వలన ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80%జ% కింద పన్ను మినహాయింపు ప్రయోజనం కూడా లభిస్తుంది.ఈ పథకంలో పెట్టుబడి పెట్టి, ప్రతి మూడు నెలలకు వడ్డీని ఉపసంహరించుకోకుండా ఉంటే.. 5ఏళ్ల తర్వాత మీ డబ్బు సుమారు రూ. 42 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. 60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న సీనియర్ సిటిజన్లకు ఆర్థిక స్థిరత్వం కోసం ఇది ఒక అద్భుతమైన ఎంపిక.

# జూ క్రెడిట్ కార్డ్ రివార్డ్ పాయింట్ల వల్ల ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయా





భారతదేశంలో చాలా మంది క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తారు. కానీ చాలా మందికి, క్రెడిట్ కార్డులను ఉపయోగించే వారికి, ఉపయోగించని వారికి క్రెడిట్ కార్డుల పేరు వినగానే వారి మనస్సులలో భయం ఏర్పడుతుంది. క్రెడిట్ కార్డు ఆర్థిక భారాన్ని కలిగించదు. సరిగ్గా ఉపయోగిస్తే మీరు దాని ప్రత్యేక ప్రయోజనాలను పొందవచ్చు. ఈ సందర్భంలో క్రెడిట్ కార్డుపై రివార్డ్ పాయింట్లను ఎలా సరిగ్గా ఉపయోగించాలో వివరంగా తెలుసుకుందాం.క్రెడిట్ కార్డ్ రివార్డ్ పాయింట్లను సరిగ్గా ఉపయోగించడం వల్ల ప్రయోజనాలను పొందడం కొంచెం కష్టంగా అనిపించవచ్చు. కానీ, క్రెడిట్ కార్డ్ రివార్డ్ పాయింట్లను ఉపయోగించడం అంత కష్టం కాదు. ఈ రివార్డ్ పాయింట్లతో మీరు ఉచిత విమానాలు, ఉచిత హోటల్ బసలు, మరిన్నింటితో సహా అనేక సేవలను సులభంగా పొందవచ్చు.క్రెడిట్ కార్డ్ వినియోగదారులు చేసే అతి పెద్ద తప్పు:క్రెడిట్ కార్డ్ వినియోగదారులు చేసే అతి పెద్ద తప్పు ఏమిటంటే వారి రివార్డ్ పాయింట్లను ట్రాక్ చేయకపోవడం. చాలా మంది క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు వారు ఎన్ని రివార్డ్ పాయింట్లు సంపాదిస్తున్నారో కూడా తెలియదు. వారు తమ అవసరాలను తీర్చుకోవడానికి తమ క్రెడిట్ కార్డులను ఉపయోగించడంపై దృష్టి పెడతారు. కానీ వారికి ఉన్న ప్రత్యేక ప్రయోజనాలను కోల్పోతారు.

# ఆగని బెదిరింపులు..

## ఈసారి రజనీ, ధనుష్ టార్గెట్‌గా ఈమెయిల్



తమిళనాడులో బాంబు బెదిరింపుల పరంపర కొనసాగుతోంది. రాష్ట్రంలో వరుసగా సినీ, రాజకీయ ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని వస్తున్న బెదిరింపులు కలకలం సృష్టిస్తున్నాయి. తాజాగా సూపర్‌స్టార్ రజనీకాంత్, ప్రముఖ నటుడు ధనుష్ ఇళ్లకు బాంబు బెదిరింపులు రావడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. వీరితో పాటు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుతంగై ఇంటిని కూడా పేల్చేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఈమెయిల్ పంపారు. వివరాల్లోకి వెళితే... చెన్నైలోని డీజీపీ కార్యాలయానికి ఒక ఈమెయిల్ అందింది. అందులో పొయెస్ గార్డెన్‌లోని రజనీకాంత్, ధనుష్ నివాసాలతో పాటు కీల్పాక్కంలో ఉన్న కాంగ్రెస్ నేత సెల్వపెరుతంగై ఇంటిని పేల్చివేస్తామని ఆగంతకులు హెచ్చరించారు. ఈమెయిల్ అందిన వెంటనే అప్రమత్తమైన ఉన్నతాధికారులు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలను హుటాహుటిన రంగంలోకి దించారు. సంబంధిత ప్రదేశాలలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఇటీవల కాలంలో తమిళనాడులో ప్రముఖులకు బాంబు బెదిరింపులు రావడం ఇది మొదటిసారి కాదు. ఈ నెల 3న ముఖ్యమంత్రి స్టాలిన్, నటి త్రిష నివాసాలు, బీజేపీ కార్యాలయంతో పాటు డీజీపీ ఆఫీసుకు సైతం బాంబు బెదిరింపులు వచ్చాయి. అలాగే, అక్టోబర్ 13న కూడా సీఎం స్టాలిన్, రజనీకాంత్ ఇళ్లకు ఇలాంటి బెదిరింపు మెయిల్స్ రావడం గమనార్హం. ఈ వరుస ఘటనలతో పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. తాజా ఘటన నేపథ్యంలో చెన్నై వ్యాప్తంగా భద్రతను పెంచారు. ఈమెయిల్ ఎవరు పంపారనే దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. వరుస బెదిరింపుల వెనుక ఒకే ముఠా హస్తం ఉందా? లేక వేర్వేరు వ్యక్తులు ఈ చర్యలకు పాల్పడుతున్నారా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.




# నాకు డబ్బు ముఖ్యం కాదు: ప్రియమణి

సినీ పరిశ్రమలో ఎప్పటినుంచో చర్చలో ఉన్న 'వేతన అసమానత' అంశంపై నటి ప్రియమణి తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. కథానాయకులతో పోలిస్తే తనకు తక్కువ పారితోషికం లభించిన సందర్భాలు ఉన్నప్పటికీ, తాను డబ్బు కంటే పాత్రలకే ఎక్కువ విలువ ఇస్తానని ఆమె స్పష్టం చేశారు. దక్షిణాది, ఉత్తరాది భాషల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రియమణి తాజా ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "నిజం చెప్పాలంటే, నా కెరీర్‌లో చాలాసార్లు నా సహనటుల కంటే తక్కువ పారితోషికం తీసుకున్నాను. కానీ ఈ విషయం నన్ను ఎప్పుడూ బాధపెట్టలేదు. ఎందుకంటే నేను డబ్బు కోసం సినిమాలు చేయను. నాకు పాత్ర నచ్చితే, అది ఎంత చిన్నదైనా సంతోషంగా ఒప్పుకుంటాను. సాధారణంగా స్టార్‌డమ్‌ను బట్టి పారితోషికం నిర్ణయిస్తారు, దాన్ని నేను గౌరవిస్తాను. అయితే ఒక పాత్రకు నేను అర్హురాలినని నాకు అనిపించినప్పుడు మాత్రం కచ్చితంగా డిమాండ్ చేస్తాను. కానీ అనవసరంగా రెమ్యూనరేషన్ పెంచమని అడగను. నటన వల్లే ప్రేక్షకులు మనల్ని గుర్తుంచుకుంటారు కానీ, మన పారితోషికం వల్ల కాదు" అని ప్రియమణి వివరించారు. ఇదే ఇంటర్వ్యూలో, దక్షిణాది, ఉత్తరాది పరిశ్రమల్లో పని విధానంలో ఉన్న తేడాల గురించి కూడా ఆమె ఆసక్తికరంగా మాట్లాడారు. "సౌత్‌లో ఉదయం 8 గంటలకు షూటింగ్ అంటే, సరిగ్గా ఆ సమయానికే మొదలవుతుంది. కానీ నార్త్‌లో మాత్రం ఆ సమయానికి నటీనటులు ఇంటి నుంచి బయల్దేరుతారు. వర్క్ డిసిప్లిన్‌లో ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆమె తెలిపారు. ప్రస్తుతం ప్రియమణి కెరీర్ పరంగా బిజీగా ఉన్నారు. ఇటీవలే 'ఆఫీసర్ ఆన్ డ్యూటీ', 'ది గుడ్ వైఫ్' వంటి వెబ్ సిరీస్‌లతో ప్రేక్షకులను పలకరించిన ఆమె, త్వరలో తమిళ స్టార్ హీరో విజయ్ నటిస్తున్న భారీ చిత్రం 'జన నాయగన్'లో ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు.

# ఎడిసన్ ఆఫ్ ఇండియా : మాధవన్ మరో ప్రయోగం

రాకెట్రి : నంబి ఎఫెక్ట్‌కమర్షియల్ విజయం తర్వాత, ఆర్.మాధవన్ మరోసారి సైంటిస్ట్ పాత్రలో నటిస్తున్నాడు. రాకెట్ సైన్స్ పితామహుడిగా పేరున్న ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణన్ (తమిళియన్) పాత్రలో అతడి నటనకు ప్రశంసలు కురిసాయి. 2022లో విడుదలైన ఈ చిత్రం ఉత్తమ ఫీచర్ ఫిలిం కేటగిరీలో జాతీయ అవార్డును సైతం అందుకుంది. ఈ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో రూపొందించిన మాధవన్ టైటిల్ పాత్రలో అద్భుతంగా నటించి మెప్పించాడు.
ఇప్పుడు మాధవన్ మరో సైంటిస్ట్ పాత్రలో నటిస్తున్నారు. భారతీయ సైంటిస్ట్ -ఇంజనీర్ జిడి నాయుడుగా అతడు తనను తాను తెరపై ఆవిష్కరించుకుంటున్నారు. పారిశ్రామిక మార్గదర్శకుడు నాయుడు పాత్రలో మాధవన్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ తాజాగా ఆవిష్కరించారు. ఈ పోస్టర్ చూడగానే.. సైంటిస్ట్ నాయుడు ఒరిజినల్ గెటప్‌లోకి మ్యాడీ ఒదిగిపోయిన తీరు ఆశ్చర్యపరుస్తోంది. బట్టతల.. సోడాబుడ్డి కళ్లద్దంతో వృద్ధ ఇంజనీర్‌గా కనిపిస్తున్న మాధవన్ ని గుర్తు పట్టడం ఎవరికైనా చాలా కష్టం. వర్క్‌షాప్‌లో లోహానికి టంకం వేస్తూ అతడు నిజమైన ప్రయోగశీలిగా కనిపిస్తున్నాడు. జి.డి. నాయుడు ఎవరి పాఠాలు వినలేదు. అతడు సెల్ఫ్ టీచింగ్ ఇంజనీర్.. పారిశ్రామికవేత్తగా తనను తాను ఆవిష్కరించుకున్నాడు. ఎందరికో మార్గదర్శకుడుగా మారారు. ఆయనను %-%ఎడిసన్ ఆఫ్ ఇండియా%-% అని పిలుస్తూ ఈ ప్రపంచం అతడి గొప్పతనాన్ని కీర్తించింది. మ్యాడీ తాజా లుక్ చూడగానే అతడు మరో సైంటిస్ట్ పాత్రకు ప్రాణం పోస్తున్నాడని నెటిజనులు కీర్తిస్తున్నారు. ప్రతిష్ఠాత్మక బయోపిక్ కి గోవింద్ వసంత సంగీతం అందిస్తుండగా, అరవింద్ కమలనాథన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. వర్గీస్ మూలన్ పిక్చర్స్ అధినేతలు వర్గీస్ మూలన్, విజయ్ మూలన్ .. ట్రైకలర్ ఫిల్మ్స్ అధినేతలు ఆర్. మాధవన్ - సరితా మాధవన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ బ్యానర్లు గతంలో ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణన్ బయోపిక్ అయిన రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్‌ను నిర్మించిన సంగతి తెలిసిందే. ఈ బయోపిక్ చిత్రానికి కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సత్యరాజ్, జయరామ్, ప్రియమణి, దుషార విజయన్, తంబి రామయ్య, వినయ్ రాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నటుడు యోగి బాబు కూడా ఈ చిత్రంలో ఒక కీలక పాత్రను పోషిస్తున్నారని కథనాలు వచ్చినా, దీనిని మేకర్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.



# 'మా ఇంటి బంగారం'...

## కొత్త సినిమా మొదలుపెట్టిన సమంత




గత కొద్ది నెలలుగా ఉన్న ఊహాగానాలకు తెరదించుతూ స్టార్ హీరోయిన్ సమంత తన కొత్త చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. 'మా ఇంటి బంగారం' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా సోమవారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది. ఈ విషయాన్ని సమంత స్వయంగా తన సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రలాలా మూవింగ్ పిక్చర్స్' పతాకంపై ఆమె ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. ఈ ప్రారంభోత్సవానికి సంబంధించిన కొన్ని ఫొటోలను సమంత తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఈ వేడుకలో ఆమె నారింజ రంగు సల్వార్ కమీజ్‌లో ఎంతో ఉత్సాహంగా కనిపించారు. ఆమెతో పాటు తన పెంపుడు శునకం 'హాష్' కూడా ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి సంబంధించిన ఫొటోను షేర్ చేస్తూ, "ఏం చూస్తున్నావ్? వాళ్లు షూటింగ్‌తో బిజీగా ఉన్నారు" అని సరదా క్యాప్షన్ జోడించారు.
"ప్రేమ, ఆశీర్వాదాల మధ్య 'మా ఇంటి బంగారం' ప్రయాణం ముహూర్తంతో ప్రారంభమైంది. మేం ఏం సృష్టిస్తున్నామో మీతో పంచుకోవడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. ఈ ప్రత్యేకమైన సినిమాను ప్రారంభిస్తున్న మాకు మీ ప్రేమ, మద్దతు కావాలి" అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, ఈ నెలలోనే తన కొత్త సినిమా షూటింగ్ మొదలవుతుందని సమంత ఇటీవల అభిమానులకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, ఇటీవల ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ 2025లో పాల్గొన్న సమంత తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లపై మాట్లాడారు. "నా విడాకులు, అనారోగ్యం.. ప్రతీది ప్రజల ముందు బహిర్గతమైంది. బలహీనంగా ఉన్నందుకు నిరంతరం విమర్శలు, ట్రోలింగ్ ఎదుర్కొన్నాను" అని ఆమె తన ఆవేదనను పంచుకున్నారు. అల్లు అర్జున్ నటించిన 'పుష్ప: ది రైజ్' చిత్రంలోని 'ఊ అంటావా' పాటలో నటించడంపైనా ఆమె స్పందించారు. "అటువంటి పాటలు నేను చేయగలనా లేదా అని పరీక్షించుకోవడానికే చేశాను. నన్ను నేను ఎప్పుడూ సెక్సీగా భావించలేదు. అది కేవలం ఒక సవాలుగా తీసుకుని చేసిన ప్రయత్నం మాత్రమే" అని సమంత వివరించారు

# 'జైలర్ 2'లో బాలీవుడ్ సీనియర్ హీరోయిన్ విద్యాబాలన్.!

రజనీకాంత్ కెరియర్లో చెప్పుకోదగిన సినిమాల జాబితాలో తప్పకుండా కనిపించేది 'జైలర్'. సన్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమాకి నెల్సన్ దర్శకత్వం వహించాడు. 200 కోట్లకి పైగా బడ్జెట్ తో నిర్మితమైన ఈ సినిమా, 600 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టింది. కథాకథనాలతో పాటు, అనిరుధ్ అందించిన నేపథ్య సంగీతం ఈ సినిమాకి ప్రధానమైన బలంగా నిలిచింది. అలాంటి ఈ సినిమాకి సీక్వెల్ రూపొందుతోంది. 'జైలర్ 2' సినిమాకి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. మొదటి భాగంలో ఉన్న ఆర్టిస్టులు ఈ సీక్వెల్ లో కొనసాగనున్నారు. అయితే బాలీవుడ్ నుంచి ఒక సీనియర్ స్టార్ ను .. సీనియర్ హీరోయిన్ ను తీసుకున్నట్టుగా సమాచారం. ఆ సీనియర్ హీరో మిథున్ చక్రవర్తి అయితే, ఆ బాలీవుడ్ భామ విద్యాబాలన్. ఈ ఇద్దరివీ ఈ సినిమాలో కీలకమైన పాత్రలనీ .. చాలా పవర్ఫుల్ పాత్రలని తెలుస్తోంది. 'జైలర్'లో లోకల్ రౌడీగా వినాయకన్ చెలరేగిపోయాడు. అయితే ఈ సీక్వెల్లో విలన్ గా మిథున్ చక్రవర్తి కనిపించనున్నాడు. ఆయన కూతురు పాత్రలో విద్యాబాలన్ కనిపించనుందని అంటున్నారు.





# డకాయిట్ కొత్త రిలీజ్ డేట్

శేష్ నటిస్తున్న తాజా చిత్రం 'డకాయిట్'. మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో హీరోయిన్. ఈ సినిమా విడుదల వాయిదా పడుతూ వస్తోంది. తొలుత ఈ సినిమాలో శృతి హాసన్‌ని హీరోయిన్‌గా అనుకున్నారు. కానీ, అనుకోకుండా ఆమె ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకుంది. ఆ తర్వాత మృణాల్ ఎంట్రీ ఇచ్చింది. అయితే ఈ సినిమాను క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదల చేద్దామని భావించారు. కానీ, అనుకోని కారణాల వల్లా ఆ తేదీకి సినిమా రిలీజ్ చేయడం కుదరకపోవడంతో కొత్త విడుదల తేదని ప్రకటించారు. వచ్చే ఏడాది ఉగాది కానుకగా ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. మార్చి 19వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం థియేటర్లలో సందడి చేయనుంది.

Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com